


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 207 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు గురువారం 2 ఏప్రిల్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :207 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE THU 2 APRIL 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur



## ఒంటిమిట్టలో సీతారాముల కల్యాణం..

## పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు

ఒంటిమిట్టలో సీతారాముల కల్యాణం

సతీసమేతంగా హాజరైన సీఎం చంద్రబాబు

స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పణ

వేదమంత్రోచ్ఛారణల మధ్య శాస్త్రోక్తంగా జరిగిన వేడుక

కల్యాణాన్ని వీక్షించేందుకు భారీగా తరలివచ్చిన భక్తులు

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన ఒంటిమిట్టలోని శ్రీ కోదండరామస్వామి ఆలయంలో శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం బుధవారం రాత్రి కన్నుల పండువగా జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి చంద్రబాబు, తన అర్ధాంగి నారా భువనేశ్వరితో కలిసి స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ ఈ వేడుక అత్యంత వైభవంగా, శాస్త్రోక్తంగా సాగింది. ఈ దివ్య కల్యాణ మహోత్సవం కోసం ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. విద్యుత్ దీపాల కాంతులతో ఆలయ ప్రాంగణం దేదీప్యమానంగా వెలిగిపోయింది. వేలాది మంది భక్తులు ఈ అపురూప ఘట్టాన్ని ప్రత్యక్షంగా వీక్షించేందుకు తరలివచ్చారు. రామనామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. పండితులు సంప్రదాయబద్ధంగా కల్యాణ ఘట్టాన్ని నిర్వహించి, భక్తులకు స్వామివారి ఆశీస్సులు అందజేశారు. శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలలో

- మిగతా 2లో

## ఇరాన్ గత పాలకుడి కంటే ఇతను కొంచెం నయం



- కాల్పుల విరమణ కోసం ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ అభ్యర్థించారని ట్రంప్ వెల్లడి
- అతడికి తక్కువ తీవ్రవాద భావజాలం, ఎక్కువ తెలివితేటలు ఉన్నాయని వివరణ
- హార్మూజ్ జలసంధిని పూర్తిగా తెరిస్తేనే కాల్పుల విరమణపై పరిశీలన అని షరతు
- షరతులు అంగీకరించకుంటే ఇరాన్‌ను నామరూపాల్లేకుండా చేస్తామని హెచ్చరిక
- మళ్లీ రాతియుగానికి పంపిస్తాం అంటూ పోస్ట్

- మిగతా 2లో



## అమరావతిపై చంద్రబాబుది డ్రామా.. ఇదే మా ప్లాన్ బీ

- అమరావతిపై అసెంబ్లీ తీర్మానం ఒక డ్రామా అన్న జగన్
- రాజధానిపై ప్లాన్-బీ ప్రతిపాదించిన మాజీ సీఎం
- మచిలీపట్నం-విజయవాడ-గుంటూరుతో 'మావిగన్' కారిడార్ సూచన
- సీఎం, మంత్రులు హైదరాబాద్‌కు షటిల్ సర్వీస్ చేస్తున్నారంటూ విమర్శ
- అమరావతి పేరిట లక్షల కోట్ల దోపిడీకి ప్లాన్ చేస్తున్నారని ఆరోపణ

- మిగతా 2లో

## ఏపీ ప్రజలకు అభినందనలు.. కానీ మా సంగతేంటి?

- అమరావతి బిల్లుకు చట్టబద్ధత కల్పించడాన్ని స్వాగతిస్తున్నాం... కానీ!: పొన్నం ప్రభాకర్
- బిల్లుకు చట్టబద్ధత నేపథ్యంలో ఏపీ ప్రజలకు అభినందనలు తెలిపిన మంత్రి
- అయితే కేంద్రం తెలంగాణకు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని విమర్శ
- ఒక రాష్ట్రానికి చట్టబద్ధత కల్పిస్తూ, మరో రాష్ట్రానికి హామీలు విస్మరించడం సరికాదన్న మంత్రి



**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి ఏర్పాటుకు చట్టబద్ధత కల్పిస్తూ లోక్ సభలో బిల్లు ఆమోదించడాన్ని తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ స్వాగతించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రజలకు ఆయన అభినందనలు తెలియజేశారు. ఇదే సమయంలో ఆయన కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.తెలంగాణ రాష్ట్రానికి విభజన సందర్భంగా ఇచ్చిన హామీల

- మిగతా 2లో

# అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్ సభ ఆమోదం

## నేడు రాజ్యసభ ముందుకు బిల్లు

- ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత
- పునర్విభజన చట్ట సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం
- చర్చ నుంచి వాకౌట్ చేసిన వైసీపీ ఎంపీలు
- నేడు రాజ్యసభ ముందుకు రానున్న బిల్లు
- రాష్ట్రపతి ఆమోదంతో చట్టంగా మారనున్న బిల్లు





**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పించే కీలక బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ బుధవారం 'ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం సవరణ బిల్లు-2026'ను సభలో ప్రవేశపెట్టారు. చర్చ అనంతరం, ఈ బిల్లు ఆమోదం పొందినట్లు ప్యానెల్ స్పీకర్ తెన్నేటి కృష్ణప్రసాద్ ప్రకటించారు. ఈ బిల్లుపై సభలో సుమారు రెండు గంటల పాటు సుదీర్ఘ చర్చ జరిగింది. తెలుగుదేశం, బీజేపీ, జనసేన, కాంగ్రెస్ పార్టీలు బిల్లుకు మద్దతు పలకగా, వైసీపీ ఎంపీలు చర్చ మధ్యలో సభ నుంచి వాకౌట్ చేశారు. 2024 జూన్ 2 నుంచి ఈ సవరణ వర్తించేలా బిల్లులో పొందుపరిచారు. ఈ చట్ట సవరణతో రాష్ట్రానికి అమరావతి ఏకైక రాజధానిగా చట్టపరమైన భద్రత లభిస్తుంది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ, "అమరావతి రైతుల కన్నీళ్ల మీద ఈ చట్టం నిర్మాణమైంది. ఇది ఆంధ్ర ప్రజల కలల రాజధాని" అని అన్నారు. బీజేపీ ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ, "అమరావతి ఆంధ్రప్రదేశ్‌కు శాశ్వత రాజధానిగానే ఉంటుంది" అని స్పష్టం చేశారు.లోక్‌సభ ఆమోదం పొందిన ఈ బిల్లు నేడు గురువారం (ఏప్రిల్ 2) రాజ్యసభ ముందుకు వెళ్లనుంది. పెద్దల సభలో కూడా ఆమోదం పొందితే, రాష్ట్రప తి ఆమోదంతో చట్టంగా మారనుంది. దీం తో గతంలో వచ్చిన మూడు రాజధానుల ప్రతిపాదనకు చట్టపరంగా తెరపడినట్లవుతుంది.



## అనిల్ అంబానీ చుట్టూ బిగుసుకుంటున్న ఉచ్చు...

### తాజాగా కేసు నమోదు చేసిన సీబీఐ

- ఎల్ఐసీకి రూ.3,750 కోట్ల నష్టం కలిగించారన్న ఆరోపణలు
- రిలయన్స్ కమ్యూనికేషన్స్, అనిల్ అంబానీపై సీబీఐ కేసు నమోదు
- తప్పుడు సమాచారంతో రూ.4,500 కోట్ల ఎన్‌సీడీలు విక్రయించారని ఫిర్యాదు
- ఫోరెన్సిక్ ఆడిట్ నివేదిక ఆధారంగా ఫిర్యాదు చేసిన ఎల్ఐసీ
- ఇప్పటికే పలు బ్యాంకుల మోసం కేసులను ఎదుర్కొంటున్న ఆర్‌కామ్

- మిగతా 2లో

## హిట్ అండ్ రన్ నేరాల కంటే ఘోరంగా ఓ పార్టీ రాజకీయాలు చేస్తోంది



- వింజమూరు సభలో వైసీపీని టార్గెట్ చేసిన సీఎం చంద్రబాబు
- కళ్లార్పకుండా అసత్యాలు ప్రచారం చేస్తోందని ఆగ్రహం
- నెల్లూరు జిల్లాలో పారిశ్రామిక ప్రగతికి పెద్దపీట వేస్తామని హామీ
- గోదావరి పుష్కరాల్లోగా పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని వెల్లడి
- చేనేతలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకం ప్రారంభం

**పెన్ పవర్ డెస్క్:**వైసీపీ తీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబు పరోక్షంగా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. హిట్ అండ్ రన్ నేరాల కంటే ఘోరంగా ఓ పార్టీ రాజకీయాలు చేస్తోందని, కళ్లార్పకుండా అసత్యాలు ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. నెల్లూరు జిల్లా వింజమూరులో జరిగిన 'పేదల సేవలో'

- మిగతా 2లో



## ఇరాన్ మిస్సైళ్లు యూరప్‌ను కూడా తాకగలవు

- యూరప్‌ను తాకగల క్షిపణులను ఇరాన్ అభివృద్ధి చేసిందన్న రూబియో
- అణుబాంబు తయారీకి ఇరాన్ అత్యంత సమీపంలో ఉందని వెల్లడి
- ఇరాన్‌పై సైనిక చర్య విజయవంతంగా సాగుతోందన్న అమెరికా
- చర్చలకు సిద్ధమేనని, కానీ షరతులు వర్తిస్తాయని స్పష్టం
- హోర్ముజ్ జలసంధిలో జోక్యం చేసుకోవద్దని ఇరాన్‌కు హెచ్చరిక

- మిగతా 2లో

## తేయాకు ఆకులు కోసి, కార్మికులతో సెల్ఫీ దిగిన ప్రధాని నరేంద్రమోదీ

- అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అసోంలో పర్యటించిన ప్రధాని మోదీ
- తేయాకు తోటను సందర్శించి మహిళా కార్మికులతో కలిసి ఆకులు కోసిన వైనం
- గోగముఖ్‌లో జరిగిన బహిరంగ సభకు హాజరు
- అసోంలో బీజేపీ హ్యాట్రిక్ సాధిస్తుందని ధీమా
- రాహుల్ గాంధీకి వందోసారి ఓటమి తప్పదని వ్యాఖ్యలు

- మిగతా 2లో



## జగన్ వ్యాఖ్యలన్నీ అబద్ధాలే.. అమరావతిపై మంత్రి నారాయణ సమగ్ర వివరణ

- అమరావతి నిర్మాణ ఖర్చుపై జగన్ చెప్పేవన్నీ అబద్ధాలని ఖండన
- ప్రజాధనం ఒక్క పైసా లేకుండానే అమరావతి నిర్మాణం అని స్పష్టీకరణ
- అమరావతి ఆర్థిక రాజధానిగా రాష్ట్రానికి ఆదాయం తెస్తుందని వెల్లడి
- 2028 ఆగస్టు నాటికి రాజధాని నిర్మాణం పూర్తి చేస్తామని ధీమా

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# అమరావతికి ఓకే.. కానీ, కండీషన్స్ అప్లై

రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించేందుకు గాను ఏపీ పునర్విభజన చట్టానికి సవరణలు చేసేందుకు లోక్ సభ ఆమోదముద్ర వేసింది. అధికార, విపక్షాలు అన్నీ ఈ చట్ట సవరణకు మద్దతు తెలపడంతో మూజువాణి ఓటుతోనే లోక్ సభ ఆమోదముద్ర వేసినట్లైంది. అయితే సభలో ఈ అంశంపై మాట్లాడిన వివిధ పార్టీలు బిల్లుకు మద్దతు చెబుతూనే కొన్ని అభ్యంతరాలు లేవనెత్తడం విశేషంగా వ్యాఖ్యానిస్తున్నారు. ప్రధానంగా బిల్లును యథాతథంగా ఆమోదించలేమంటూ వాకౌట్ చేసిన వైసీపీతోపాటు బిల్లును సమర్థించిన కాంగ్రెస్, ఎస్పీ తదితర పార్టీలు కొన్ని కీలకసూచనలు చేశాయి.రాజధాని అమరావతి నిర్మాణం కోసం భూములు త్యాగం చేసిన రైతులకు ముందుగా న్యాయం చేయాలని వివిధ పార్టీలు సూచించాయి. ప్రధానంగా వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి మాట్లాడుతూ రాజధాని నిర్మాణం ఎప్పుడు పూర్తి చేస్తారు? రైతులకు అభివృద్ధి చేసి ఇస్తామన్న ప్లాట్లు ఎప్పుడిస్తారు? రైతులు ఎలా న్యాయం చేస్తారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. రాజధాని మొదటి దశ నిర్మాణం పూర్తికాకుండానే అదనపు భూ సమీకరణకు ఎందుకు వెళుతున్నారో స్పష్టం చేయాలని కోరారు.ఇక మిథున్ రెడ్డి తర్వాత సభలో మాట్లాడిన కాంగ్రెస్, సమాజ్ వాది ఎంపీలు సైతం అమరావతి బిల్లును సమర్థిస్తూనే కొన్ని సూచనలు చేశారు. ప్రధానంగా సమాజ్ వాది పార్టీకి చెందిన ఎంపీ ధర్మేంద్ర యాదవ్ వ్యాఖ్యలు ఆసక్తికర చర్చకు దారితీశాయి. రాజధాని అమరావతి బిల్లును తాము సమర్థిస్తున్నామని, అయితే రాజధానిగా విశాఖను ఎంపిక చేస్తే బాగుండేదని ధర్మేంద్ర యాదవ్ వ్యాఖ్యానించారు. అదేవిధంగా తమ పార్టీ రైతుల పక్షపాతి అని పేర్కొంటూ రాజధాని రైతులకు తక్షణ న్యాయం చేయాలని సమాజ్ వాది తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు.కాంగ్రెస్ నేత మాణిక్కం ఠాగూర్ సైతం రాజధానిగా అమరావతికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఎవరూ ఏపీకి అన్యాయం చేయాలని చూసినా తమ పార్టీ అంగీకరించదని తేల్చిచెప్పారు. అయితే రాజధాని రైతులకు న్యాయం చేయడం విస్మరించొద్దని సూచించారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన తెలంగాణ ఎంపీలు రఘురామిరెడ్డి, గడ్డం వంశీకృష్ణ సైతం రాష్ట్ర పునర్విభజన సవరణ బిల్లుపై జరిగిన చర్చలో పాల్గొన్నారు. విభజన హామీలను నెరవేర్చాలని వంశీకృష్ణ కోరగా, ఖమ్మంజిల్లాకు చెందిన గ్రామాలను తిరిగి తెలంగాణకు వదిలేయాలని ఏపీ ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు ఖమ్మం ఎంపీ రఘురామిరెడ్డి వ్యాఖ్యానించారు. మొత్తానికి రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించే విషయంలో అన్నిపార్టీలు ఒకే మాటపై నిలబడినా, రాజధాని రైతుల విషయంలో విపక్షం కొంచెం గట్టిగా మాట్లాడటం ప్రత్యేకంగా నిలిచిందని అంటున్నారు.

# హిట్ అండ్ రన్ నేరాల కంటే ఘోరంగా ఓ పార్టీ రాజకీయాలు చేస్తోంది

- మొదటి పేజి తరువాయి

కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో ఆయన ప్రసంగించారు. ప్రతిపక్షం చేస్తున్న అసత్య ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని ఆయన కోరారు.

**హిట్ అండ్ రన్ కంటే దారుణం**

జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ విషయంలో వైసీపీ అసత్యాలు ప్రచారం చేస్తోందని చంద్రబాబు ఆరోపించారు. 2018–19లోనే తమ ప్రభుత్వం రూ.285 కోట్లతో హార్బర్ నిర్మాణానికి కేంద్రానికి ప్రతిపాదనలు పంపిందని గుర్తు చేశారు. కానీ, ఇప్పుడు ఆ వాస్తవాలను వక్రీకరించి దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కృష్ణపట్నం పోర్టును వాణిజ్యపరంగా మార్చినప్పుడు నాటి కాంగ్రెస్ పాలకులు పట్టించుకోలేదని అన్నారు.

కూటమి ప్రభుత్వంలోని ప్రజాప్రతినిధులు మత్స్యకారులకు ఎన్నడూ అన్యాయం చేయరని భరోసా ఇచ్చారు. ఏపీ జలాల్లోకి తమిళనాడు మత్స్యకారులు వచ్చి వేట చేయకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ విషయంలో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని నెల్లూరు, తిరుపతి కలెక్టర్లకు వేదిక నుంచే చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

**సంక్షేమ పథకాల వెల్లువ**

ప్రజలపై ఉన్న అభిమానంతోనే తమ ప్రభుత్వం పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని చంద్రబాబు తెలిపారు. ప్రతి నెలా రూ.2,750 కోట్లను కేవలం పెన్షన్ల కోసమే వ్యయం చేస్తున్న ఏకైక రాష్ట్రం ఏపీ అని, పొరుగున ఉన్న తమిళనాడులో కేవలం రూ.1000 మాత్రమే ఇస్తున్నారని పోల్చి చెప్పారు. 'తల్లికి వందనం' కింద గత ఏడాది అందించిన ఆర్థిక సాయాన్ని మళ్లీ జూన్‌లో ఆడబిడ్డల ఖాతాల్లో జమ చేస్తామని ప్రకటించారు. 'దీపం 2.0' పథకం కింద ఏటా మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందిస్తున్నామని, త్వరలోనే పైపులైన్ల ద్వారా ఇంటింటికీ గ్యాస్ సరఫరా చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వివరించారు.

**అభివృద్ధి, పెట్టుబడులే లక్ష్యం**

సంక్షేమంతో పాటు రాష్ట్రాభివృద్ధికి కూడా తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని చంద్రబాబు స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టుకు కేంద్రం రూ.1300 కోట్లు అడ్వాన్స్‌గా ఇచ్చిందని, గోదావరి పుష్కరాల నాటికి ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. నెల్లూరు జిల్లా పారిశ్రామికంగా వేగంగా అభివృద్ధి చెందుతోందని, రామాయపట్నం, దుగరాజపట్నం వంటి పోర్టులు రానున్నాయని తెలిపారు.

ఉదయగిరిలో డ్రోన్లు, మానవ రహిత విమానాల తయారీ పరిశ్రమ రాబోతోందని, పెట్టుబడులకు ఏపీ గమ్యస్థానంగా మారిందని అన్నారు. ఇఫ్కో సెజ్ ద్వారా 80 వేల మందికి ఉద్యోగాలు వస్తాయని చెప్పారు.

**సుపరిపాలన – చేనేతలకు వరం**

సుపరిపాలన అందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని చంద్రబాబు పునరుద్ఘాటించారు. ఈ మహాయజ్ఞానికి ఎవరు ఆటంకం కలిగించినా సహించేది లేదని, ప్రభుత్వ సేవల్లో లోపాలుంటే ఆకస్మిక తనిఖీలు చేస్తానని హెచ్చరించారు. డిసెంబరు నాటికి 4.5 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేసి గృహప్రవేశాలు చేయిస్తామన్నారు. ఈ సందర్భంగా, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చేనేతలకు ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం కింద 93 వేల చేనేత కుటుంబాలకు 200 యూనిట్లు, 11,443 పవర్‌లూమ్‌లకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామని, ఇందుకోసం రూ.153 కోట్లు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. అనంతరం, లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందించారు. ఈ సందర్భంగా చేనేతలు సీఎంను నూలు దండతో సత్కరించారు.

# తేయాకు ఆకులు కోసి, కార్మికులతో సెల్ఫీ దిగిన ప్రధాని నరేంద్రమోదీ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అసోంలోని దిబ్రుగఢ్ జిల్లాలోని ఒక తేయాకు తోటను సందర్శించారు. అక్కడి మహిళా కార్మికులతో కలిసి తేయాకు ఆకులను కోశారు. వారితో సెల్ఫీలు దిగారు. ఈ ఫొటోలను మోదీ తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో పంచుకున్నారు. పలువురు కార్మికులు మోదీతో సెల్ఫీ దిగేందుకు ఆసక్తి చూపించారు. మోదీ రాక నేపథ్యంలో గిరిజన కార్మికులు సంప్రదాయ నృత్యంతో ఆయనకు స్వాగతం పలికారు.

**బహిరంగ సభలో రాహుల్ గాంధీపై విమర్శలు**

అసోం అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గోగముఖ్‌లో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. అసోంలో బీజేపీ మూడోసారి గెలిచి హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని ప్రధాని మోదీ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ యువరాజు రాహుల్ గాంధీకి వందోసారి ఓటమి తప్పదని ఎద్దేవా చేశారు.అసోం మాజీ సీఎం శర్బానంద సోనోవాల్, ప్రస్తుత ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ విభజన విధానాలను అనుసరిస్తోందని ఆరోపించారు. అసోంలో ఉమ్మడి పౌర స్మృతిని అమలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలోని ఆదివాసీల హక్కులను కాపాడుతామని హామీ ఇచ్చారు.

# అమరావతిపై చంద్రబాబుది డ్రామా.. ఇదే మా ప్లాన్ బీ

అమరావతి రాజధాని నిర్మాణంపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. అమరావతిని రూ.2 లక్షల కోట్ల భారీ ఆర్థిక కుంభకోణంగా అభివర్ణించిన ఆయన, దీనికి ప్రత్యామ్నాయంగా 'ప్లాన్ బి' పేరుతో 'మావిగన్' (మీూ౦×ఙూచీ) అనే కొత్త ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు నగరాలను కలుపుతూ ఈ రాజధాని ప్రాంతాన్ని అభివృద్ధి చేయవచ్చని ఆయన సూచించారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఈరోజు మీడియాతో మాట్లాడారు.

**ఏమిటీ 'మావిగన్' ప్లాన్?**

జగన్ వివరించిన 'మావిగన్' ప్రణాళిక ప్రకారం, మచిలీపట్నం నుంచి విజయవాడ (70 కి.మీ.), విజయవాడ నుంచి గుంటూరు (40 కి.మీ.) వరకు విస్తరించి ఉన్న 110 కిలోమీటర్ల కారిడార్‌ను రాజధాని ప్రాంతంగా ప్రకటించాలి. ఈ ప్రాంతంలో ఇప్పటికే 35–40 లక్షల జనాభా నివసిస్తోందని, జాతీయ రహదారి వంటి మౌలిక సదుపాయాలు ఉన్నాయని జగన్ గుర్తుచేశారు. అమరావతికి ప్రతిపాదించిన రూ.2 లక్షల కోట్లలో కేవలం 10% నిధులు, అంటే రూ.20,000 కోట్లతో ఈ ప్రాంతంలో రింగ్ రోడ్లు, ఇతర అనుసంధాన మార్గాలు ఏర్పాటు చేస్తే, ఇది సహజంగానే ఒక మెగాసిటీగా, అభివృద్ధి కేంద్రంగా మారుతుందని ఆయన వివరించారు. తన హయాంలో మచిలీపట్నం పోర్టు పనులు ప్రారంభించామని, దానివల్ల ఈ ప్రాంతానికి మరింత ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. ఇప్పటికే అభివృద్ధి చెందిన ఈ ప్రాంతంలో అవినీతికి ఆస్కారం తక్కువ కాబట్టే, ప్రస్తుత ప్రభుత్వం ఈ ప్రణాళికను పక్కన పెట్టిందని ఆరోపించారు.

**అమరావతి.. అవినీతి రాజధాని**

అమరావతిని 'అవినీతి రాజధాని'గా జగన్ అభివర్ణించారు. చంద్రబాబు ప్రభుత్వమే కేంద్రానికి, బ్యాంకులకు ఇచ్చిన లెక్కల ప్రకారం, అమరావతిలో కేవలం రోడ్లు, కరెంట్, డ్రైనేజీ వంటి కనీస వసతులకే ఎకరానికి రూ.2 కోట్లు ఖర్చవుతుందని తెలిపారు. ఈ లెక్కన 50,000 ఎకరాలకు రూ.1 లక్ష కోట్లు, లక్ష ఎకరాలకు రూ.2 లక్షల కోట్లు అవసరమవుతాయని, ఇది రాష్ట్రాన్ని దివాళా తీయించడానికేనని విమర్శించారు. చంద్రబాబు తన గత, ప్రస్తుత పాలనలో కలిపి ఏడేళ్లలో కేవలం రూ.8,000 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని, ఈ వేగంతో ప్రాజెక్టు పూర్తి చేయడానికి ఎన్ని దశాబ్దాలు పడుతుందని ప్రశ్నించారు.నిర్మాణ వ్యయాల్లో భారీ అవినీతి జరుగుతోందని జగన్ ఆరోపించారు. బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ వంటి నగరాల్లో ఐదు నక్షత్రాల సౌకర్యాలతో ఫ్లాట్ నిర్మించడానికి చదరపు అడుగుకు రూ.4,500 ఖర్చయితే, అమరావతిలో రూ.11,000 నుంచి రూ.14,000 వరకు చూపిస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వం ఉచితంగా ఇసుక, భూమి, జీఎస్టీ మినహాయింపులు ఇస్తున్నా ఇంత భారీ వ్యయం ఎందుకని నిలదీశారు. టవర్ల నిర్మాణం, ఫ్లైఓవర్ల వ్యయాన్ని ఇతర నగరాలతో పోల్చి, భారీ వ్యత్యాసాలను ఎత్తిచూపారు. అమరావతిలో కిలోమీటర్ ఫ్లైఓవర్‌కు రూ.170 కోట్లు చూపిస్తుంటే, తన హయాంలో విజయవాడ బెంజ్ సర్కిల్‌లో కేవలం రూ.35 కోట్లతో పూర్తి చేశామన్నారు. ఢిల్లీలోని కొత్త పార్లమెంట్, తెలంగాణ సచివాలయం కన్నా ఏపీ అసెంబ్లీ, హైకోర్టుల నిర్మాణ వ్యయాలు ఎక్కువగా ఉండటాన్ని ఆయన తప్పుపట్టారు.సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ కుటుంబాలు హైదరాబాద్‌లోనే ఉంటున్నాయని, వారు అమరావతికి కేవలం షటిల్ సర్వీస్ చేస్తున్నారని జగన్ ఎద్దేవా చేశారు. 2014 నుంచి ఇప్పటివరకు సుదీర్ఘకాలం పాలనలో ఉన్న చంద్రబాబు అమరావతికి ఏం చేశారని, రైతులకు ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చలేదని ప్రశ్నించారు. అమరావతిపై తీర్మానం పేరుతో అసెంబ్లీలో చంద్రబాబు కొత్త డ్రామా ఆడారని, సభను కేవలం తనను, వైసీపీని దూషించడానికి వాడుకున్నారని విమర్శించారు. అమరావతిపై ఉన్న శ్రద్ధ వల్ల విద్యా దీవెన, ఆరోగ్యశ్రీ వంటి సంక్షేమ పథకాలు నిలిచిపోయాయని, రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. విశాఖను కార్యనిర్వాహక రాజధానిగా, కర్నూలును న్యాయ రాజధానిగా చేయాలన్నదే తమ విధానమని పునరుద్ఘాటించారు. తాము అధికారంలోకి వచ్చాక అమరావతి కుంభకోణంపై పూర్తిస్థాయి విచారణ జరిపి, దోషులను శిక్షిస్తామని జగన్ హెచ్చరించారు.

# ఇరాన్ గత పాలకుడి కంటే ఇతను కొంచెం నయం

అమెరికా, ఇరాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఇరాన్ కొత్త నాయకత్వం తమతో కాల్పుల విరమణ కోరిందని వెల్లడించారు. అయితే, తాము అందుకు అంగీకరించాలంటే కీలకమైన హర్మూజ్ సముద్ర మార్గంపై తమ షరతులకు ఒప్పుకోవాల్సి ఉంటుందని అన్నారు. అంతవరకు సైనిక ఒత్తిడి కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. బుధవారం సోషల్ మీడియా వేదికగా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. "గత పాలకుడితో పోల్చితే ఇరాన్ నూతన పాలకుడు (సుప్రీం లీడర్) కొంచెం నయం అనిపిస్తున్నాడు. అతడికి తక్కువ తీవ్రవాద భావజాలం, ఎక్కువ తెలివితేటలు ఉన్నాయి. ఇప్పుడతను అమెరికాతో కాల్పుల విరమణ కోరారు!" అని ట్రంప్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. హర్మూజ్ జలసంధిని స్వేచ్ఛగా, సురక్షితంగా తెరిచి ఉంచినప్పుడు మాత్రమే కాల్పుల విరమణ ప్రతిపాదనను పరిశీలిస్తామని ఆయన తేల్చిచెప్పారు. ప్రపంచ ఇంధన రవాణాలో హర్మూజ్ జలసంధి అత్యంత కీలకమైనది కావడంతో కాల్పుల విరమణకు ట్రంప్ ఈ అంశాన్ని ముందుకు తెస్తున్నారు. ఈ షరతులను నెరవేర్చే వరకు ఇరాన్‌పై సైనిక చర్యలను మరింత తీవ్రతరం చేస్తామని ట్రంప్ తన పోస్ట్‌లో హెచ్చరించారు. "మాటవినకుంటే ఇరాన్‌ను నామరూపాల్లేకుండా చేస్తాం లేదా వారు చెప్పినట్లుగా మళ్లీ రాతియుగానికి పంపిస్తాం!" అని ఆయన తీవ్ర వ్యాఖ్యలు చేశారు.అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ కూడా విలేకరులతో మాట్లాడుతూ, ఎలాంటి ముప్పునైనా ఎదుర్కొనేందుకు, ఒత్తిడిని కొనసాగించేందుకు తమ బలగాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. సముద్ర మార్గాల్లో స్వేచ్ఛాయుత రవాణాను కాపాడటమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

# ఏపీ ప్రజలకు అభినందనలు.. కానీ మా సంగతేంటి?

- మొదటి పేజి తరువాయి

అమలులో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం–2014లో తెలంగాణకు పలు కీలక హామీలు ఉన్నాయని, వాటి అమలు విషయంలో కేంద్రం వివక్షపూరితంగా వ్యవహరించడం ఆందోళన కలిగిస్తోందని అన్నారు.బయ్యారం ఉక్కు పరిశ్రమ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ఐఐఎం, సాగునీటి ప్రాజెక్టుకు జాతీయ హోదా వంటి కీలక ప్రాజెక్టులు ఇంకా ఆచరణకు నోచుకోలేదని అన్నారు. ఈ ప్రాజెక్టులు తెలంగాణ అభివృద్ధికి కీలకమని గుర్తుచేశారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు, పారిశ్రామిక ప్రోత్సాహకాలు వంటి అంశాల్లో కూడా కేంద్రం మాట తప్పిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఒక రాష్ట్రానికి చట్టబద్ధతతో ముందుకు తీసుకెళ్లే చర్యలు తీసుకుంటూ, మరో రాష్ట్రానికి ఇచ్చిన హామీలను విస్మరించడం సరైనది కాదని మంత్రి అన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గౌరవిస్తూ విభజన చట్టంలో పొందుపరిచిన అన్ని హామీలను కేంద్ర ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# జగన్ వ్యాఖ్యలన్నీ అబద్ధాలే.. అమరావతిపై మంత్రి నారాయణ సమగ్ర వివరణ

మాజీ ముఖ్యమంత్రి జగన్ చేస్తున్న ఆరోపణలపై రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అమరావతి నిర్మాణ ఖర్చులు, ఇతర అంశాలపై జగన్ చెబుతున్నవన్నీ పచ్చి అబద్ధాలని, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకే ఆయన పదేపదే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఢిల్లీలో తాను స్వయంగా అధికారులతో మాట్లాడి వాస్తవాలు తెలుసుకున్నానని, జగన్ మాత్రం నోటికి వచ్చిన లెక్కలు చెబుతున్నారని విమర్శించారు.

**అమరావతికి తిరుగులేని చట్టబద్ధత**

అమరావతి రాజధాని విషయంలో జగన్ ఇకపై ఎలాంటి గందరగోళం సృష్టించలేరని మంత్రి నారాయణ స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం–2014కు కీలక సవరణ చేసిందని, సెక్షన్ 5, సబ్–సెక్షన్ 2లో అమరావతి రాజధాని ప్రాంతాన్ని (217 చదరపు కిలోమీటర్లు) స్పష్టంగా నిర్వచించిందని తెలిపారు. ఈ చట్టసవరణతో రాజధానిపై పూర్తిస్థాయి స్పష్టత వచ్చిందని, ఇది రాష్ట్ర ప్రజలకు శుభవార్త అని అన్నారు. గతంలో జగన్ ఆడిన "మూడు ముక్కలాట"కు ఈ సవరణతో తెరపడిందని, ఇకపై ఆయన ఎన్ని వేషాలు వేసినా చెల్లవని వ్యాఖ్యానించారు.

**ప్రజాధనంతో కాదు.. ల్యాండ్ పూలింగ్‌తోనే నిర్మాణం**

అమరావతి నిర్మాణానికి రూ. 2 లక్షల కోట్లు అవుతుందని జగన్ చెప్పడం హాస్యాస్పదమని మంత్రి నారాయణ కొట్టిపారేశారు. ప్రజాధనం నుంచి ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టకుండానే రాజధాని నిర్మాణం జరుగుతుందని పునరుద్ఘాటించారు. "ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకొచ్చిన ల్యాండ్ పూలింగ్ విధానమే దీనికి ఆధారం. రైతుల నుంచి సమీకరించిన భూమిని అభివృద్ధి చేసి, వారికి కొంత వాటా ఇచ్చాక మిగిలిన ప్రభుత్వ భూమిని అమ్మి, ఆ డబ్బుతోనే నిర్మాణాలు చేపడతాం. దీనికోసం ప్రస్తుతం బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుంటాం. ప్రభుత్వం వద్ద సుమారు 5,000 ఎకరాలకు పైగా భూమి ఉంది. భవిష్యత్తులో దీని విలువ పెరిగాక అమ్మితే, ఆ డబ్బుతో అప్పులు తీర్చడమే కాకుండా, రాష్ట్రానికి అదనపు ఆదాయం కూడా వస్తుంది" అని ఆయన వివరించారు.

**ఆర్థిక వృద్ధి కేంద్రంగా అమరావతి**

అమరావతి కేవలం పరిపాలనా రాజధాని కాదని, రాష్ట్రానికి ఒక ఆర్థిక చోదక శక్తి (ఎకనామిక్ గ్రోత్ ఇంజిన్)గా మారబోతోందని నారాయణ ధీమా వ్యక్తం చేశారు. "ఈరోజు తెలంగాణ రాష్ట్రానికి వచ్చే ఆదాయంలో 70 శాతం ఒక్క హైదరాబాద్ నుంచే వస్తోంది. అదేవిధంగా కర్ణాటకకు బెంగళూరు, తమిళనాడుకు చెన్నై, మహారాష్ట్రకు ముంబై ఆర్థిక కేంద్రాలుగా ఉన్నాయి. ఆ నగరాల నుంచి వచ్చే ఆదాయాన్ని మిగతా జిల్లాల అభివృద్ధికి పంచుతున్నారు. అదే దూరదృష్టితో చంద్రబాబు అమరావతిని నిర్మిస్తున్నారు" అని తెలిపారు. అంతర్జాతీయ స్థాయి స్పోర్ట్స్ సిటీ, అంతర్జాతీయ విమానాశ్రయం వంటివి నిర్మించడం ద్వారా పర్యాటకం, హోటల్ రంగం అభివృద్ధి చెంది, వేలాది మందికి ఉపాధి లభిస్తుందని అన్నారు.

**2028 ఆగస్టు డెడ్‌లైన్**

ముఖ్యమంత్రి చంద్రబాబు తన అపార అనుభవంతో రూపొందించిన ప్రణాళిక ప్రకారం పనులు వేగంగా జరుగుతాయని, 2028 ఆగస్టు నాటికి అమరావతిని పూర్తి చేసి ప్రజలకు అంకితం చేస్తామని నారాయణ స్పష్టం చేశారు. కొన్ని భవనాలు ఇప్పటికే పూర్తయ్యాయని, దశలవారీగా మిగతా పనులు కూడా పూర్తవుతాయని చెప్పారు. తాము ప్రజల కోసం రాజధాని కడుతుంటే, జగన్ మాత్రం తన బొమ్మను సర్వే రాళ్లపై వేసుకోవడానికి రూ.750 కోట్లు, హైదరాబాద్, వైజాగ్‌లలో ప్రజాధనంతో ప్యాలెస్‌లు కట్టుకున్నారని తీవ్రంగా ఆరోపించారు.గత ఐదేళ్లలో రాజధాని కోసం భూములిచ్చిన రైతులను జగన్ ప్రభుత్వం పెట్టిన ఇబ్బందులను మంత్రి గుర్తుచేశారు. మహిళలని కూడా చూడకుండా బూటుకాళ్లతో తన్నారని, లాఠీఛార్జీలు చేసి, ఫెన్సింగ్ వేసి నిర్బంధించారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల త్యాగాలకు, పోరాటానికి ఈరోజు చట్టసవరణతో న్యాయం జరిగిందని, ఇక రాష్ట్ర ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.

# అనిల్ అంబానీ చుట్టూ బిగుసుకుంటున్న ఉచ్చు... తాజాగా కేసు నమోదు చేసిన సీబీఐ

పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ, ఆయన సంస్థ రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) చుట్టూ ఉచ్చు మరింత బిగుస్తోంది. భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్‌ఐసీ)కి రూ.3,750 కోట్ల మేర నష్టం కలిగించారన్న ఆరోపణలపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ) బుధవారం కేసు నమోదు చేసింది. ఈ కేసులో అనిల్ అంబానీ, ఆర్‌కామ్‌తో పాటు కొందరు గుర్తుతెలియని ప్రభుత్వ ఉద్యోగులు, ఇతరులను నిందితులుగా చేర్చారు.ఎల్‌ఐసీ చేసిన ఫిర్యాదు ఆధారంగా ఈ కేసు నమోదు చేసినట్లు సీబీఐ ఒక ప్రకటనలో తెలిపింది. కుట్ర, మోసం, నిధుల దుర్వినియోగం వంటి అభియోగాలతో పాటు అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఆర్‌కామ్ ఆర్థిక పరిస్థితిపై తప్పుడు సమాచారం ఇచ్చి, ఆస్తులకు మించిన భద్రత ఉందని నమ్మించి, రూ.4,500 కోట్ల విలువైన నాన్–కన్వర్టిబుల్ డిబెంచర్లను (ఎన్‌సీడీ) ఎల్‌ఐసీకి మోసపూరితంగా అంటగట్టారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

బీడీవో ఇండియా ఎల్‌ఎల్‌పీ అనే సంస్థ 2020 అక్టోబర్ 15న ఇచ్చిన ఫోరెన్సిక్ ఆడిట్ నివేదికను ఎల్‌ఐసీ తన ఫిర్యాదుకు ఆధారంగా చూపింది. బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి సేకరించిన నిధులను దుర్వినియోగం చేయడం, అనుబంధ సంస్థల ద్వారా నిధులను దారి మళ్లించడం, నకిలీ బిల్లులతో నిధులు పొందడం వంటి అనేక అక్రమాలకు ఆర్‌కామ్ పాల్పడినట్లు ఆడిట్‌లో తేలింది.ఆర్‌కామ్, అనిల్ అంబానీపై సీబీఐ కేసులు నమోదు చేయడం ఇది మొదటిసారి కాదు. ఇప్పటికే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నేతృత్వంలోని పలు బ్యాంకులను మోసం చేశారన్న ఆరోపణలపై మూడు కేసులు నమోదయ్యాయి. ఎస్‌బీఐకి రూ.2,929.05 కోట్లు నష్టం కలిగించారన్న కేసులో సీబీఐ అధికారులు అనిల్ అంబానీని ఢిల్లీలో రెండు రోజుల పాటు విచారించారు కూడా. ఎస్‌బీఐతో పాటు పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా వంటి పలు బ్యాంకులు కూడా ఆర్‌కామ్‌పై ఫిర్యాదులు చేశాయి. ప్రస్తుతం ఈ కేసులన్నింటిపైనా దర్యాప్తు కొనసాగుతోందని సీబీఐ వెల్లడించింది.

# ఇరాన్ మిస్సైళ్లు యూరప్‌ను కూడా తాకగలవు

యూరప్‌లోని సుదూర ప్రాంతాలను సైతం తాకగల క్షిపణులను ఇరాన్ అభివృద్ధి చేసిందని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా చేపట్టిన సైనిక చర్యను సమర్థిస్తూ, ఇరాన్ ఆయుధ కార్యక్రమాలతో ప్రపంచానికి పెను ముప్పు ఉందని ఆయన హెచ్చరించారు.

ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో రూబియో మాట్లాడుతూ, ఇరాన్ ఇటీవల ప్రయోగించిన క్షిపణులు తమ అంచనాలకు మించిన సామర్థ్యాన్ని ప్రదర్శించాయని తెలిపారు. "ఆ క్షిపణులు యూరప్‌లోని చాలా ప్రాంతాలకు చేరగలవు" అని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో అమెరికా ప్రధాన భూభాగాన్ని కూడా లక్ష్యంగా చేసుకునే దీర్ఘశ్రేణి క్షిపణుల తయారీకి ఇరాన్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఇరాన్ క్షిపణి, అణు కార్యక్రమాలను వేర్వేరుగా చూడలేమని రూబియో స్పష్టం చేశారు. "ఇరాన్ ఇప్పటికే 60 శాతం స్వచ్ఛతతో యురేనియంను శుద్ధి చేసింది. కేవలం 12 నుంచి 14 రోజుల్లోనే దాన్ని 90 శాతం స్వచ్ఛతకు (అణుబాంబు తయారీకి అవసరమైన స్థాయి) చేర్చగలదు. అణుబాంబులో ఉపయోగించడానికి తప్ప 60 శాతం శుద్ధి చేసిన యురేనియం వల్ల మరో ప్రయోజనం ఉండదు" అని ఆయన వివరించారు.

ఇరాన్ తన అణు కార్యక్రమానికి రక్షణ కవచంగా అత్యాధునిక ఆయుధాలను సమకూర్చుకోకుండా నిరోధించేందుకే సైనిక చర్య ప్రారంభించామని రూబియో తెలిపారు. ఇరాన్ వాయుసేన, నౌకాదళాన్ని ధ్వంసం చేయడం, క్షిపణి లాంచర్లను నిర్వీర్యం చేయడం, డ్రోన్లు, క్షిపణుల తయారీ ఫ్యాక్టరీలను ధ్వంసం చేయడం వంటి నాలుగు లక్ష్యాలతో ఈ ఆపరేషన్ సాగుతోందని చెప్పారు. "ఈ లక్ష్యాల సాధనలో మేము అనుకున్నదానికంటే వేగంగా ఉన్నాం. లక్ష్యానికి చాలా దగ్గరగా ఉన్నాం" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సైనిక చర్య కొనసాగుతున్నప్పటికీ, చర్చల ద్వారాలు తెరిచే ఉన్నాయని, ఇరుపక్షాల మధ్య సందేశాలు మార్పిడి జరుగుతున్నాయని రూబియో అన్నారు. అయితే, చర్చల పేరుతో కాలయాపన చేయడాన్ని సహించబోమని, దొంగచాటు చర్చలకు అంగీకరించబోమని స్పష్టం చేశారు. హర్మూజ్ జలసంధిలో నౌకల రవాణాకు ఇరాన్ ఆటంకం కలిగిస్తే అది అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమే అవుతుందని, ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు నష్టం కలుగుతుందని హెచ్చరించారు.

# ఒంటిమిట్టలో సీతారాముల కల్యాణం.. పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు

- మొదటి పేజి తరువాయి

భాగంగా జరిగే ఈ కల్యాణ వేడుకకు రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు హాజరయ్యారు. భక్తుల సౌకర్యార్థం అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ కల్యాణ వేడుక భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని పంచింది. ఈ వేడుకలో చంద్రబాబు, భువనేశ్వరి దంపతులతో పాటు మనవడు నారా దేవాన్ష్ కూడా పాల్గొన్నాడు.

పెన్ పవర్
మార్కాపురం - ప్రకాశం

# అమరావతి మన ఏకైక రాజధాని -ఎమ్మెల్యే ముత్తుముల




**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 01**

గిద్దలూరు నియోజకవర్గం ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి మాట్లాడుతూ నేడు అమరావతి రాజధాని బిల్లును పార్లమెంటులో పెట్టడం జరుగుతుందని శనివారం నాడు అసెంబ్లీ వేదికగా ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అమరావతి మన ఆంధ్రుల ఏకైక రాజధాని అని తీర్మానించి కేంద్రానికి పంపించడం జరిగిందని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తర్వాత అమరావతి మన రాజధాని అని దానిని కదిలించడం ఎవరితరం కాదన్నారు .గత వైయస్సార్ ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డ మూడు రాజధానులు అని మూడు ముక్కలు ఆడి ప్రజలను అయోమయనికి గురిచేసిందని రాజధాని లేని రాష్ట్రం గా ఉంచి మన పిల్లల భవిష్యత్తు మీద దెబ్బ కొట్టడం జరిగిందని మరల, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అమరావతి రాజధాని అని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీర్మానం చేయడం ద్వారా మన రాజధాని అమరావతి అని ప్రకటించడం జరుగుతుందని తెలిపారు.

# అధికారులు బాధ్యతతో పనిచేయాలి

**-కొంతమంది నిర్లక్ష్యంవల్ల పనులు ముందుకు సాగడం లేదు**

**-సమస్య తెలుసుకుని వెంటనే స్పందించడం - వీలైనంత త్వరగా పరిష్కరించడం ఇవే ముఖ్యం**

**-ఇకనుంచి ప్రతినెలా శాఖల వారీగా సమీక్షిస్తానన్న ఎమ్మెల్యే ఇంటూరి**





**కందుకూరు పెన్ పవర్ ఏప్రిల్ 1**

కందుకూరులోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో, నియోజకవర్గస్థాయి అధికారులతో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు బుధవారం సమీక్ష నిర్వహించారు. ఆయనతోపాటు సబ్ కలెక్టర్ దామెర హిమవంశీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బడ్జెట్ లో శాఖల వారీగా కేటాయించిన నిధులు, పెండింగ్ పనులు, గ్రీవెన్స్ అర్జీల పరిష్కారం, అధికారుల పనితీరుపై సుదీర్ఘంగా సమీక్ష చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులలో కొన్నిచోట్ల రోగులకు కనీస వసతులు లేవు. తాగునీరు కూడా ఏర్పాటు చేయలేని పరిస్థితి ఉంది. ప్రభుత్వం ఇస్తున్న నిధులను ఖర్చు చేయకుండా అలాగే బ్యాంకుల్లో ఉంచుకుంటే ఉపయోగం ఏముంది ? ఒక్కోచోట కాలం చెందిన మందులను తగలబెడుతున్నారు. గడువు తీరక ముందే, వాటిని ఉపయోగించుకోవాలన్న కనీస ఆలోచన చేయకపోతే ఎలా ? ఆరోగ్యశాఖ అధికారుల తీరు ఇకనైనా మారాలి అని అన్నారు. ఉలవపాడు, గుడ్లూరు లాంటి పంచాయతీల్లో పారిశుధ్యం దారుణంగా ఉంది. రోడ్ల వెంబడే గుట్టలుగుట్టలుగా చెత్త కనిపిస్తోంది. ఎన్నిసార్లు హెచ్చరించినా అధికారుల్లో మార్పులేదు. చివరికి మెమోలు ఇచ్చినా లైట్ తీసుకుంటున్నారు. ఇలా అయితే ఎలా ? నిధులు అందుబాటులో ఉన్నప్పుడు ఖర్చు చేయటానికి మీకేం ఇబ్బంది ? చివరిసారిగా అవకాశం ఇస్తున్నాను. ఇకనైనా సక్రమంగా పనిచేయకపోతే చర్యలు తప్పవు అని హెచ్చరించారు. గ్రామాల మధ్య, పొలాలకు వెళ్లే రోడ్లు చిల్లచెట్లతో మూసుకుపోయి ఉన్నాయి. స్మశానాల్లో పరిస్థితి మరీ ఇబ్బందికరం. ఈ మధ్యకాలంలో నేను చెప్పకుండా, ఒక్కచోటైనా జంగిల్ క్లియరెన్స్ చేయించారా ? ప్రజల బాధలు మీకెందుకు కనిపించవు ? పదేపదే చెబుతున్నా.. కొందరు నిర్లక్ష్యంగానే ఉన్నారు. గ్రామాలకు వెళ్ళినప్పుడు ప్రజలు ఇలాంటి సమస్యలపై అడుగుతున్నారు. ఇప్పటికైనా మత్తువదిలి పనులు మొదలు పెట్టండి అని అన్నారు. పాఠశాలల్లో వసతులు, సౌకర్యాలపై ఇప్పటినుంచే దృష్టి పెట్టాలి. పాఠశాలలు తెరిచే జూన్ 12 లోగా పనులు పూర్తి చేయండి. పాఠశాలలు, హాస్టల్స్ లో మధ్యాహ్న భోజనం నాణ్యత గురించి ఒక్క చిన్న ఫిర్యాదు కూడా రాకూడదు అని అన్నారు. దేవాదాయశాఖ అధికారుల వ్యవహార శైలి.. కోపం తెప్పిస్తోంది. కొత్త ఆలయాల నిర్మాణానికి సంబంధించి, ఆయా గ్రామాలప్రజలు సిజిఎఫ్ రూపంలో ఇచ్చిన 35 లక్షల రూపాయలు ఏడాది నుంచి బ్యాంకుల్లోనే ఉన్నాయి. కానీ అధికారులు సకాలంలో ప్రతిపాదనలు పంపకపోవడం వల్ల... 4 కోట్ల రూపాయల నిధులు రాలేదు. ఆ శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి ఫోన్ చేసినా ఇక్కడ వారు స్పందించలేదు అని అన్నారు. రెవిన్యూ శాఖపై ఫిర్యాదు అందని రోజు లేదు. ప్రతి మండలంలో ఇలాగే ఉంది. నియోజవర్గ స్థాయిలో రెవెన్యూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయి. తమ దగ్గరకు వచ్చిన ప్రతి అర్జీని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, వెంటనే స్పందించాలి. వీలైనంత త్వరగా వాటికి పరిష్కారం చూపాలి. రైతుల్లో ఆగ్రహం పెరగకముందే రెవెన్యూ సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి అని అన్నారు. ప్రజలు ఏమి కోరుకుంటున్నారో వాటిపై తక్షణం నివేదికలు తయారు చేయండి. పెండింగ్ సమస్యలను గుర్తించి త్వరగా పరిష్కరించండి. నిధులను సక్రమంగా వినియోగించండి. ఇకనుంచి ప్రతి నెలా శాఖల వారిగా సమీక్ష నిర్వహిస్తాను అని అన్నారు. నియోజకవర్గ ప్రజల కన్నీళ్లు తుడవాల్సిన బాధ్యత నాపై ఉంది. పదేపదే వారిని ఆఫీసుల చుట్టూ తిప్పించుకోవద్దు. మీరు సక్రమంగా పనిచేసి, వాస్తవ పరిస్థితులపై నాకు నివేదికలు తయారు చేసి ఇస్తే... ఉన్నతాధికారులు, మంత్రులతో మాట్లాడి అవసరమైన నిధులు సాధిస్తాను.ఇంకా పెద్ద సమస్యలైతే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తాను. అధికారులందరూ బాధ్యతతో, సమన్వయంతో పనిచేసి కందుకూరు నియోజకవర్గాన్ని ప్రగతి పథంలో నిలిపేందుకు సహకరించాలి అని ఎమ్మెల్యే నాగేశ్వరరావు అధికారులకు సూచించారు.

# పీ.ఎం సూర్యఘర్‌తో విద్యుత్ చార్జీలకు చెక్

**మంత్రి గొట్టిపాటి. రవికుమార్**





**అద్దంకి ఆర్సి ఇంచార్జ్(పెన్ పవర్) ఏప్రిల్ 1**

పీఎం సూర్యఘర్ పథకంతో రాష్ట్రంలో విద్యుత్ వినియోగదారులకు కరెంటు బిల్లుల భారం నుంచి భారీ ఊరట లభించనుందని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి. రవికుమార్ తెలిపారు. బుధవారం అద్దంకి నియోజకవర్గం పేరాయపాలెంలో పర్యటించిన మంత్రి.. లబ్ధిదారులకు సామాజిక సంక్షేమ పింఛన్లను పంపిణీ చేశారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం పని చేస్తోందని, కేవలం ఒక్క సంతకంతోనే పింఛను పెంచి సామాన్యులకు ఆర్థిక భరోసా కల్పించారని ఆయన స్పష్టం చేశారు. పల్లెల అభివృద్ధితోనే గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాకారమవుతుందని తెలిపారు.

**విద్యుత్ వ్యవస్థను గాడిలో పెడుతున్న సీ.ఎం**

అద్దంకి మండలం, పేరాయపాలెంలో రూ. 4.60 కోట్లతో నిర్మించనున్న 33/11 కేవీ సబ్ స్టేషన్‌కు మంత్రి గొట్టిపాటి భూమి పూజ చేశారు. అలాగే పీఎం సూర్యఘర్ పథకం కింద 200 యూనిట్ల లోపు వాడే లబ్ధిదారుని ఇంటి వద్ద ఏర్పాటు చేసిన 2 కేవీ సోలార్ యూనిట్‌ను ప్రారంభించారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిన విద్యుత్ వ్యవస్థను సీఎం చంద్రబాబు గాడిలో పెడుతున్నారని, 22 నెలల పాలనలో విద్యుత్ ఛార్జీలు పెంచకుండా 13 పైసలు ట్రూ డౌన్ చేయడం ఆయన దార్శనికతకు నిదర్శనమన్నారు. అద్దంకి నియోజకవర్గంలో లో-వోల్టేజ్ సమస్యల పరిష్కారానికి 7 సబ్ స్టేషన్లు, రూ.25 కోట్లతో రెండు 132 కేవీ సబ్ స్టేషన్లు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. పీఎం సూర్యఘర్ కింద అద్దంకిలో 6వేల కనెక్షన్లు ఇస్తుండగా, అందులో 1241 ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు పూర్తిగా ఉచితంగా ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం మోదేపల్లి, కుంకుబాడు గ్రామాల్లో పర్యటించిన మంత్రి.. రూ.60 లక్షలతో నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాళ్లు, రూ.40 లక్షలతో నిర్మించిన అంతర్గత సిమెంట్ రోడ్లు, సైడ్ డ్రైన్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలి

**జిల్లా కలెక్టర్ రాజాబాబు**




**అద్దంకి ఆర్సి ఇంచార్జ్(పెన్ పవర్) ఏప్రిల్ 1:**

వేసవిలో అద్దంకి రెవెన్యూ డివిజన్ పరిధిలో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు అధికారులను ఆదేశించారు. బుధవారం అద్దంకి ఆర్డీవో కార్యాలయంలో రెవెన్యూ, ఆర్డబ్ల్యూఎస్, ఇరిగేషన్, మున్సిపల్ శాఖల అధికారులతో ఆయన ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ?ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మిషన్ మోడ్‌లో 'జల సురక్ష' కార్యక్రమాన్ని చేపట్టి నీటి ట్యాంకులను శుభ్రపరచడం, నీటి నాణ్యతను పరీక్షించడం, చేతిపంపులు, కుళాయిలకు అవసరమైన మరమ్మతులు చేయాలని ఆదేశించారు. ఈ పనుల్లో కానీ, భూగర్భ నీటిమట్టం పెంచే చర్యల్లో కానీ ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా సహించేది లేదని అధికారులను హెచ్చరించారు. ?కొరిశపాడు రిజర్వాయర్ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లింపుల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. రానున్న వర్షాకాలంలో వర్షపు నీరు వృథా కాకుండా జల సంరక్షణ చర్యలు పటిష్టంగా చేపట్టాలని, చెరువులు, కాలువల పూడికతీత, లింక్ కెనాల్స్ క్లియర్ చేయడం, జంగిల్ క్లియరెన్స్ వంటి పనులు పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ?తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణపై ప్రభుత్వం నిర్వహిస్తున్న ఐవీఆర్ఎస్ సర్వేలో ప్రజల నుంచి సానుకూల అభిప్రాయం వ్యక్తమయ్యేలా అధికారుల పనితీరు ఉండాలన్నారు. అద్దంకి పట్టణంలో పారిశుధ్య నిర్వహణపై మరింత దృష్టి సారించటంతో పాటు, పబ్లిక్ టాయిలెట్ల నిర్మాణాలకు వెంటనే ప్రతిపాదనలు పంపాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. సమావేశంలో అద్దంకి ఆర్డీవో జాన్సన్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, ఎస్డీసీ విజయ జ్యోతి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



# రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టండి

**జిల్లా కలెక్టర్ విజయ సునీత**





**మార్కాపురం టౌన్ పెన్ పవర్ ఏప్రిల్ 1**

జిల్లా లో ప్రధానంగా నెలకొన్న రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత అధికారులను ఆదేశించారు. బుధవారం మార్కాపురం కలెక్టరేట్లో జిల్లాలోని తహసీల్దార్ లు, మండల సర్వేలతో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే 6 నెలలు రెవెన్యూ సమస్యలపైనే దృష్టి పెడతామని తెలిపారు. రీ సర్వే జరిగే గ్రామాలను ప్రతిరోజు తహసిల్దార్ లు వెళ్లాలన్నారు. మ్యుటేషన్స్, 22 ఏ భూములు, ఇతరుల భూములు వంటి వాటిలో చెడ్డ పేరు రాకుండా అధికారులు చూసుకోవాలన్నారు. రెవెన్యూ చట్టానికి విరుద్ధంగా అధికారులు వ్యవహరిస్తే సహించేది లేదన్నారు. రెవిన్యూ విషయాల్లో మార్కాపురం జిల్లా వెనుకబడి ఉందని ఆ చెడ్డ పేరు పోగొట్టేందుకు అధికారులు ప్రయత్నం చేయాలని తెలిపారు. ముఖ్యంగా వీఆర్వోలు సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా ఉన్నారని ఇది మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. అదేవిధంగా ప్రజా సమస్యల పరిష్కారం వేదిక కార్యక్రమం లో వచ్చే అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఇలా అయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పదే పదే వచ్చే అర్జీదారులను నేరుగా కలసి ఫీల్డ్ సర్వే చేయాలన్నారు. పీజీఆర్ఎస్ పై ప్రతిరోజు రిపోర్టు ఇవ్వాలని ఆదేశించారు. ఇప్పటి నుంచి అయినా సమస్యలను తగ్గించి జిల్లా కు మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు, మార్కాపురం ఆర్డీవో ప్రభాకర్, కనిగిరి ఇంచార్జి ఆర్డీవో శివరామిరెడ్డి, డీఎస్వో అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర రాజధానిగా అమరావతి తీర్మానం శుభ పరిణామం

**మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి స్పష్టం**



**పొదిలి, పెన్ పవర్, ఏప్రిల్ 1**

ఆంధ్రప్రదేశ్ కు అమరావతి రాజధానిగా నిర్ణయిస్తూ పార్లమెంటులో తీర్మానించడం ఎంతో శుభ పరిణామమని మార్కాపురం నియోజకవర్గ శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి చెప్పారు. బుధవారం నాడు పొదిలిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ అమరావతిని రాజధానిగా తీర్మానించడం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయమని నారాయణరెడ్డి చెప్పారు. అందుకు మార్కాపురం నియోజకవర్గ ప్రజల తరఫున భారత ప్రధాని నరేంద్ర మోడీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామని ఆయన చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పై నమ్మకం ఉంచి అమరావతి రాజధాని కోసం 20,000 మంది రైతులు 31 వేల ఎకరాల తమ పొలాలను స్వచ్ఛందంగా అందజేశారని కందుల చెప్పారు. గతంలో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అమరావతి రైతులకు ఇబ్బంది పెట్టారని కందుల ఆక్షేపించారు. అమరావతిని రాజధానిగా ఏర్పాటు చేస్తుంటే సహకరించాల్సిన ప్రతిపక్షం వైసిపి నాయకులు అడ్డంకులు కల్పించడం ఎంతవరకు సమంజసం అని కందుల ప్రశ్నించారు. రాష్ట్ర ప్రగతిని చూసి ఓర్వలేక ప్రతిపక్షం అయిన వైసిపి పార్టీ నాయకులు దేవతల రాజధాని అమరావతిని అడ్డుకోవడం సిగ్గుచేటని కందుల విమర్శించారు. ఇప్పటికైనా ప్రతిపక్ష వైసిపి నాయకులు అమరావతి రాజధాని నిర్మాణానికి సహకరించడంతోపాటు, బురద చల్లే ప్రయత్నాలను విరమించుకోవాలని ఎమ్మెల్యే కందుల హితువు పలికారు. సమావేశంలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి తోపాటు పొదిలి మార్కెట్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంస, రాష్ట్ర తెలుగుదేశం కార్యదర్శి గునుపూడి భాస్కర్, రాష్ట్ర టీఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి వరికుంట్ల అనిల్ కుమార్, మాజీ సర్పంచ్ వై వెంకటేశ్వర రెడ్డి, మండల తెలుగుదేశం అధ్యక్షులు అంజిరెడ్డి, పొదిలి నగర పంచాయతీ విభాగపు తెలుగుదేశం అధ్యక్షులు ముల్లా కుద్దూస్, మండల తెలుగు యువత అధ్యక్షులు పోపూరి నరేష్, నాయకులు షేక్ అల్లా బకాష్, శివాలయం ఛైర్మన్ ఒగ్గు వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

# పొదిలిలో వివాహిత అనుమానాస్పద మృతి



**పొదిలి, పెన్ పవర్, ఏప్రిల్ 1**

పొదిలిలో ఒక వివాహిత అనుమానస్పదంగా మృతి చెందింది. పట్టణానికి చెందిన పట్టణానికి చెందిన నలగట్ల స్రవంతి నలగట్ల స్రవంతి అనే యువతికి మండలంలోని ఉన్న గురువాయపాలెం కు చెందిన చెన్నయ్య తో సుమారు నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. చెన్నయ్య నూడుల్స్ వ్యాపారం చేసుకుంటూ స్థానిక రథం రోడ్డులో ఒక అద్దె ఇంట్లో తన భార్యతో జీవనం సాగిస్తున్నారు. వీరికి రెండేళ్ల ఒక పాప కూడా ఉంది. అయితే ఏం జరిగిందో ఏమో గాని స్రవంతి మంగళవారం రాత్రి తన ఇంట్లో ఉరివేసుకొని మృతి చెందింది. బుధవారం ఉదయం మండల తహసిల్దార్ ఎం వి కృష్ణారెడ్డి, పొదిలి ఎస్ ఐ. రాజేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కాగా మృతి చెందిన స్రవంతి తల్లితండ్రులు తమ కుమార్తె మరణం పట్ల అనుమానాలు వ్యక్తం చేశారు. మరణించిన స్రవంతి స్థానిక రథం రోడ్డులో ని ఒక ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తుంది. ఈ సంఘటనపై పొదిలి ఎస్సై రాజేష్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. స్రవంతి మరణానికి గల కారణాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

# రైల్వే రిక్రూట్మెంట్ గ్రూప్ డి పరీక్షలకు ఉచిత శిక్షణ

**అభ్యర్థులు నుండి దరఖాస్తులను**

**ఆహ్వానిస్తున్న ఎబిసిడబ్ల్యూఓ డి హరిప్రసాద్**

**పెన్ పవర్ గిద్దలూరు ఏప్రిల్ 1**



వెనుకబడిన సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు రైల్వే రిక్రూట్మెంట్ గ్రూప్ డి పరీక్షల ఉచిత శిక్షణ కు ఉమ్మడి ప్రకాశం జిల్లా కు చెందిన అర్హులైన బి సి ఎస్సి ఎస్టీ కులములకు చెందిన అభ్యర్థుల నుండి దరఖాస్తు ల ను స్వీకరిస్తున్నట్లు గిద్దలూరు బి సి సహాయ సంక్షేమాధికారి దమ్మాల హరిప్రసాద్ ఒక ప్రకటన లో తెలిపారు. అభ్యర్థుల దరఖాస్తుల ను స్వీకరించుటకు ఏప్రిల్ 10 వరకు పొడిగించటం జరిగిందన్నారు. అభ్యర్థులు అందరూ దరఖాస్తు చేసుకోవాలని,ఎంపికైన అభ్యర్థుల కు అరవై రోజుల పాటు ఉచిత శిక్షణ ఉంటుందన్నారు.ఉచిత శిక్షణ తో పాటి స్టైఫండ్ ,స్టడీ మెటీరియల్ ఇవ్వటం జరుగుతుందన్నారు.ఈ స్టడీ సర్కిల్లో లో 100 మంది అభ్యర్థుల ను ఎంపిక చేయటం జరిగుతుందన్నారు. అభ్యర్థులు తమ బయో డాటా తో పాటు పదవ తరగతి మార్కుల లిస్ట్,నకళ్ళు కుల ,ఆదాయ ధ్రువీకరణ పత్రాలు తల్లి దండ్రుల ఆదాయం లక్ష లో పు మాత్రమే,ఆధార్, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్, రైల్వే రిక్రూట్మెంట్ గ్రూప్ డి ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్న ఆన్లైన్ నకల్లు రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫోటో తో ఏప్రిల్ 10 వ తేదీ లోపు ఏ పి బి సి స్టడీ సర్కిల్ లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాల కు 9849655379 సంప్రదించాలని ఎబిసిడబ్ల్యూఓ హరిప్రసాద్ కోరారు.

## నాలుగు లేబర్ కోడ్స్ లను రద్దు చేయాలని

# సిఐటి ఆధ్వర్యంలో నిరసన



**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 01**

కార్మికులను బానిసలుగా మారుస్తున్న నాలుగు లేబర్ కోడ్స్ లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం గిద్దలూరు పట్టణంలోని సివిల్ సప్లై హమాలీ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద నిరసన తెలియజేశారు .ఈ సందర్భంగా సిఐటియు నాయకులు టీ ఆవులయ్య మాట్లాడుతూ ఫిబ్రవరి 12వ తేదీన దేశవ్యాప్తంగా వేలాదిమంది కార్మికులు కార్మికుల హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జాతీయస్థాయిలో సమ్మె చేసిన కేంద్ర ప్రభుత్వం కార్మిక సంఘాల మనవి వినకుండా ఏప్రిల్ ఒకటో తేదీ నుండి నుండి 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్ గా అమలు చేయడం కార్మికులను బానిసలుగా మార్చడమేనని అన్నారు. ఈ లేబర్ కార్డు అమలుకు నిరసనగా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. ఈ నిరసన ఆర్టీసీ ఉద్యోగులు మున్సిపల్ కార్మికులు నల్ల బ్యాడ్జీలు పెట్టుకొని డ్యూటీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు పి శ్రీనివాసులు ఎన్ వీరయ్య ఓబులేసు మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు ఎం మురళి డి రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# పండుగలా పింఛన్లు పంపిణీ

## -లబ్ధిదారుల స్వయంగా నగదు అందజేసిన ఇంటూరి

**కందుకూరు పెన్ పవర్ ఏప్రిల్ 1**

పట్టణం 9వ వార్డు ప్రకాశంకాలనీ మరియు రెవెన్యూ కాలనీల్లో కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, ఎన్టీఆర్ భరోసా పింఛన్లను బుధవారం పంపిణీ చేశారు. 30 మందికి పైగా లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి, వారికి పింఛన్ నగదు అందించారు. ఈ సందర్భంగా పలువురు వృద్ధులు, దివ్యాంగులు... పింఛన్ డబ్బులు అందుకుంటూ మురిసిపోయారు. కూటమి ప్రభుత్వం పెంచి ఇస్తున్న పింఛన్ డబ్బులతో సంతోషంగా ఉన్నామని, మందులు, ఇతర అవసరాలకు ఉపయోగించుకుంటున్నామని ఎమ్మెల్యేతో తమ అభిప్రాయాలు పంచుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చల్లగా ఉండాలని, పెద్ద కుమారుడిలాగా తమ బాగోగులు చూసుకుంటున్నారని సంతోషంగా మాట్లాడారు. తమకు ప్రభుత్వ పథకాలు సక్రమంగానే అందుతున్నాయని... తమ చుట్టు పక్కల కొత్త అభివృద్ధిని చూస్తున్నామని స్థానికులు ఎమ్మెల్యేతో చెప్పారు.

ఎమ్మెల్యే నాగేశ్వరరావు బదులిస్తూ... మీ అందరి ఆశీర్వాదాలే తనను ముందుకు నడిపిస్తున్నాయని, ప్రభుత్వ సహకారంతో మరిన్ని మంచి పనులు చేసి, 2029 ఎన్నికల్లో మీ ముంగిటకు వస్తానని అన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి చంద్రబాబు వందల కోట్ల రూపాయలతో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఆయనకు అందరూ సపోర్టుగా నిలవాలని ఎమ్మెల్యే నాగేశ్వరరావు కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అనూష, పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి షేక్ సలాం, స్థానిక నాయకులు



వంకాయలపాటి రాజేంద్రప్రసాద్, వార్డు అధ్యక్షులు పర్సు నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి చదలవాడ ఇమ్మానియేలు, చేవూరి రమేష్, జడ పోతయ్య, వంకాయలపాటి కోటేశ్వరరావు, ఉచ్చులూరి నిరంజన్, పర్సు కోటయ్య, అత్యాల నిరంజన్, గంధం సన్నీ, కంచర్ల గోపి, దామా కోటేశ్వరరావు, అత్తోట మాల్యాద్రి, దూదిపల్లి మహేష్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఉప్పుటూరి శ్రీను, రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి షేక్ రఫీ, నెల్లూరు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ రూబీ, అధికార ప్రతినిధి చదలవాడ కొండయ్య, నియోజకవర్గ అధ్యక్షుడు అల్లం



వెంకటేశ్వర్లు, నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు షేక్ మున్నా, వడ్డెళ్ళ రవిచంద్ర, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి కూనం నరేంద్ర, పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు సవిడిబోయిన కృష్ణ, మాజీ కౌన్సిలర్ కొచ్చర్ల శ్రీను, చుండూరి శ్రీను, జియవుద్దీన్, కోట కిషోర్, మురారిశెట్టి సుధీర్, భవనాసి వెంకటేశ్వర్లు, అత్తింటి శివకృష్ణ, పీలా శ్రీను, పసుపులేటి రమణయ్య, రాయపాటి శ్రీను, అన్ని వార్డుల అధ్యక్షులు, అనుబంధ సంఘాల కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెన్షన్ పంపిణీలో ఎమ్మెల్యే ముత్తుముల






**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 01**

గిద్దలూరు మండలం కృష్ణం శెట్టి పల్లె పంచాయితీ పెద్ద చెరువు తాండా లో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పాల్గొన్నారు తండాలోని ప్రతి ఇంటికి వెళ్లి స్వయంగా పెన్షన్ పంపిణీ చేశారు ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ నెలలో ఒకటో తేదీన ఖచ్చితంగా ప్రతి ఇంటికి పెన్షన్ పంపిణీ చేయడం జరుగుతుందని గత వైకాపా ప్రభుత్వంలో ఉపాధ్యాయులకు కానీ ప్రభుత్వ ఉద్యోగస్తులకు కానీ నెలకు జీతము సరిగా ఇచ్చే వారు కాదని కానీ నేడు కూటమి ప్రభుత్వంలో ప్రతి ఒక్క ప్రభుత్వ ఉద్యోగికి , పెన్షన్ దారులకు ఒకటవ తేదీననే ఉదయాన్నే లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పెన్షన్ పంపిణీ చేయడం జరుగుతుందని ఇది కూటమి ప్రభుత్వం పేద ప్రజల పట్ల ఉన్న శ్రద్ధ అని తెలిపారు ఇప్పటివరకు 65 శాతం పెన్షన్ పంపిణీ పంపిణీ అయినదని సాయంత్రానికి 97శాతం పూర్తి అవుతుందని కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ కృష్టంసెట్టి పల్లె పంచాయతీలో 510 పింఛన్లకు 22 ,38,000 రూపాయలు పంపిణీ చేయడం జరుగుతుందని గిద్దలూరు నియోజకవర్గానికి 38,454 పింఛన్లకు గాను 17 , 21, 55 ,000 వేల రూపాయలు పంపిణీ చేయడం జరుగుతుందని దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఒక సంవత్సరానికి 33 ,000 వేల కోట్ల రూపాయల ఖర్చు పెట్టి పెన్షన్ ఇవ్వడం జరగడం లేదని ఒక్క మన ఆంధ్రప్రదేశ్లో మాత్రమే కూటమి ప్రభుత్వం ఇవ్వడం జరుగుతుందని తెలిపారు సూపర్ సిక్స్ పథకాలు ప్రతి ఒక్క పేద ప్రజలకి అందించడం జరిగిందని గత ప్రభుత్వంలో రాష్ట్రాన్ని పూర్తిగా నాశనం చేశారని కానీ నేడు కూటమి ప్రభుత్వం వాటన్నిటినీ అధిగమించి ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తున్నారని అభివృద్ధిలో ముందుకు పోతుందని తెలిపారు చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత కార్మికులకు కూటమి ప్రభుత్వం చేనేత కుటుంబాలకు పవర్ గిఫ్ట్ పూర్తిగా ఉచితంగా ఇవ్వడం వలన వారి కుటుంబాలకు ఎంతో మేలు చేస్తుందని 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మరమగ్గాలు ఉన్నవారికి 500 యూనిట్లు ఉచితంగా విద్యుత్ ఇవ్వడం జరుగుతుందని దీని ద్వారా చేనేత కుటుంబానికి ఒక సంవత్సరానికి 8,640 మరమగాలు ఉన్నవారికి 21,600 లాభం చేకూరుతుందని దీనివల్ల చేనేత కుటుంబాలకు ఆర్థికంగా ఎంతో లాభదాయకంగా ఉంటుందని దీనితోపాటు జీఎస్టీ మినహాయింపును కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాని కోరడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో మండల రెవిన్యూ అధికారులు, ఎంపిడిఓ సీతారామయ్య అధికారులు, హౌసింగ్, సచివాలయ సిబ్బంది, తో పాటు మార్కెట్ యార్డ్ చైర్మన్ బైలడుగు బాలయ్య, పాలుగుల్ల ప్రతాప్ రెడ్డి, హనుమంత్ రెడ్డి, శ్రీను నాయక్, బద్రి గోపాల్ రెడ్డి, కంకర వెంకట రెడ్డి, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సజవుగా సాగుతున్న టెన్త్ పబ్లిక్ పరీక్షల పట్ల డీఈవో సంతృప్తి

**కొమరోలు పెన్ పవర్ ఏప్రిల్ 1**

కొమరోలు లోని రెండు పరీక్ష కేంద్రాలలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో సాగుతున్నాయని హర్షం వ్యక్తం చేస్తూ, ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా మంచి ఫలితాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని ఉమ్మడి ప్రకాశం జిల్లా విద్యాశాఖ అధికారిని రేణుక తెలిపారు. బుధవారం డీఈవో రేణుక కొమరోలు, గోపానిపల్లెలోని ఎయిడెడ్ పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. అనంతరం డి ఈ ఓ రేణుక కొమరోలు లోని మండల విద్యాశాఖ అధికారుల కార్యాలయంలో పాత్రికేయులతో మాట్లాడుతూ, ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా 10వ తరగతి పబ్లిక్ పరీక్షలలో అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల కొరకు వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేశారని ఆమె తెలిపారు. తద్వారా ప్రధానోపాధ్యాయులు, సబ్జెక్టు ఉపాధ్యాయుల ఉదయం సాయంత్రం స్టడీ అవర్స్ ,పరీక్ష నిర్వహణ , ఈరోజు కా రోజు మూల్యంకనం చేసి మార్పులను విద్యార్థి తల్లిదండ్రులకు తెలియజేసే కార్యక్రమాలు జరిగాయన్నారు. దీంతో విద్యార్థులు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సంతృప్తిగా వ్రాసేందుకు సన్నధులై పబ్లిక్ పరీక్షలు రాస్తున్నారని ఆమె తెలిపారు. రంజాన్ పర్వదిన సందర్భంగా మార్చి 21వ తేదీన వివరించవలసిన ఇంగ్లీష్ పరీక్షను ఏప్రిల్ 2వ తేదీకి వాయిదా వేశామన్నారు. రెండవ తేదీతో పదో తరగతి పబ్లిపరీక్షలు . ముగియనున్నాయని త్వరలో మూల్యాంకనం చేయించి ఫలితాలు వెల్లడించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లుగా ఆమె పేర్కొన్నారు .అన్ని పాఠశాలల్లో ఈ ఏడాది నిర్వహించిన 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు వలన ఈ ఏడాది జిల్లావ్యాప్తంగా అత్యుత్తమ ఫలితాలు సాధించే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. కొమరోలు లోని రెండు పరీక్షా కేంద్రాలలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సమర్థవంతంగా, సజావుగా ప్రశాంత వాతావరణంలో సాగుతున్నట్లుగా తమకు ఎప్పటికప్పుడు సమాచారం అందుతున్నదని ఆమె పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటవ తరగతి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులలో అభ్యసన




సామర్థ్యాలు మెరుగుపరిచేందుకు జి ఎఫ్ ఎల్ ఎన్ 75 రోజుల కార్యక్రమం అమలు చేస్తున్నట్లుగా ఆమె తెలిపారు. దీనితో ప్రాథమిక స్థాయిలో విద్యార్థులలో గట్టి పునాదులు వేసే అవకాశం ఏర్పడుతున్నట్లుగా ఆమె వివరించారు. జిల్లా వ్యాప్తంగా అనేక ఎయిడెడ్ పాఠశాలల్లో బోగస్ రోలు కొనసాగుతున్నట్లుగా ఫిర్యాదులు అవుతున్నాయని అందువల్ల ఎయిడెడ్ పాఠశాలల తనిఖీల్లో భాగంగా బుధవారం కొమరోలు, గోపానిపల్లె లోని ఎయిడెడ్ పాఠశాలలను సందర్శించి తనిఖీ చేశామన్నారు. తమ సందర్శించి పరిశీలించిన పాఠశాలల్లో గోపానిపల్లెలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య చాలా తక్కువగా ఉన్నట్టుగా గుర్తించామన్నారు. . ఆ పాఠశాల యాజమాన్యానికి షోకాజ్ నోటీసులు ఇవ్వనున్నట్లుగా ఆమె తెలిపారు. అంతేకాక ఆ పాఠశాలలపై అవసరమైన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా కొమరోలు మండల విద్యాశాఖ అధికారులను ఆదేశించినట్లుగా ఆమె తెలిపారు. కొమరోలు లోని ఎస్ బి ఎన్ ఆర్ ఎం పాఠశాలలో బోగస్ రోలు లేదని, పాఠశాలలను ఎస్ బి ఎన్ ఆర్ ఎం యాజమాన్యం, ప్రధానోపాధ్యాయులు సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని, ఆమె తెలిపారు. ఆ కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ వరప్రసాద్ కొమరోలు ఎంఈఓ 2 బొర్ర వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

# జలజీవన్ మిషన్ పనులను పరిశీలించిన కలెక్టర్



**మార్కాపురం రూరల్ పెన్ పవర్ ఏప్రిల్ 1**

మార్కాపురం మండలం గొట్టిపడియ వద్ద రూ.1290 కోట్లతో జరుగుతున్న జల జీవన్ మిషన్ పనులను బుధవారం జిల్లా కలెక్టర్ ఎం విజయ సునీత పరిశీలించారు. జిల్లాలో తాగునీటి పరిష్కారం కోసం చేపట్టిన ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనులు చేస్తున్న విధానం, ఇప్పటివరకు పూర్తయిన పనులు, చేయాల్సిన వాటిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితుల్లో పనులు ఆలస్యం చేయవద్దని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, ఆర్ డబ్ల్యూఎస్ ఈఈ సురేష్ బాబు, ఆర్డీవో ప్రభాకర్, తహసీల్దార్ చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

# బస్సు యాక్సిడెంట్ కేసులో ముద్దాయిలు అరెస్ట్

**మీడియా ముందు ప్రవేశపెట్టిన పోలీసులు**



**మార్కాపురం పెన్ పవర్ ఏప్రిల్ 1**

గత నెల 26వ తేదీన ఉదయం 5:40 గంటల సమయంలో మార్కాపురం మండలం రాయవరం గ్రామం మార్కాపూర్ నుండి ఒంగోలు వెళ్లే రహదారి లో పలకల క్వారీ మూలమలుపు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో మొత్తం 14 మంది అక్కడికక్కడే చనిపోగా 29 మంది గాయపడ్డారు. బుధవారం స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్ కార్యాలయంలో డిఎస్పి నాగరాజు విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. హరికృష్ణ ట్రావెల్స్ డ్రైవర్, మొదటి ముద్దాయి పందెం. యువరాజు విచారణలో భాగంగా అదే బస్సు కు రెండు సంవత్సరాల నుండి క్లీనర్ గా పనిచేస్తూ డ్రైవింగ్ నేర్చుకొని ఈ మధ్యకాలంలోనే ఆ బస్ కి డ్రైవర్ గా చేస్తున్నాడు. ఈ క్రమంలో జగిత్యాల నుండి వినుకొండ రహదారి మీదుగా నెల్లూరు జిల్లా కలిగిరి వెళ్తున్న క్రమంలో బస్సు మూడుసార్లు రిపేర్ రాగా ఓనర్ కు సమాచారం ఇవ్వడం జరిగింది.ఓనర్ అయినటువంటి హరిబాబు వినుకొండ రోడ్డు బాగాలేదు ఎర్రగొండపాలెం మీదుగా రమ్మని డ్రైవర్ కు చెప్పాడని డ్రైవర్ ఎర్రగొండపాలెం మీదుగా వస్తున్న క్రమంలో మరలా రెండుసార్లు సెన్సార్ ప్రాబ్లం అవ్వగా బస్సులో ఉన్నటువంటి ప్రయాణికులు బస్సు ప్రాబ్లం ఉందని వేరే బస్ అరేంజ్ చేయమని డ్రైవర్ తో వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో డ్రైవర్ ఓనర్ కి ఫోన్ చేయగా నేను మెకానిక్ ని తీసుకొని వస్తున్నాను నాకు ఎదురుగా రమ్మని చెప్పి అక్కడి నుండి బయలుదేరి మరల ఎక్కడ ఆగిపోతుందో అని అతివేగంతో బస్సు నడిపానని రాయవరం గ్రామం కొండ మూల మలుపు వద్దకు వచ్చేసరికి స్టీరింగ్ కంట్రోల్ కాక టిప్పర్ను ఢీకొనడం జరిగిందని చెప్పాడు. ఈ క్రమంలో డ్రైవర్ యువరాజ్, ఓనర్ హరిబాబు అయినటువంటి ఇద్దరు ముద్దాయిలను రాయవరం రైల్వే బ్రిడ్జి వద్ద మార్కాపురం డిఎస్పి యు నాగరాజు, సీఐ సుబ్బారావు సిబ్బంది అరెస్టు చేసినట్లు చెప్పారు. ఈ మీడియా సమావేశంలో రూరల్ ఎస్సై వేమన, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ఇంటూరి

### -22.5 లక్షలతో 3 రోడ్ల నిర్మాణం

### -ప్రకాశం కాలనీ, రెవిన్యూ కాలనీ వాసులకు తీరనున్న కష్టాలు





**కందుకూరు పెన్ పవర్ ఏప్రిల్ 1**

పట్టణంలోని 9వ వార్డు ప్రకాశం కాలనీ మరియు రెవెన్యూ కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు బుధవారం శంకుస్థాపన చేశారు. 22.5 లక్షల రూపాయల ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో 3 రోడ్లు నిర్మించనున్నారు. తమకు రోడ్డు కష్టాలు తీరబోతున్నాయని కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ వారంతా ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. పట్టణ చరిత్రలో ఎప్పుడూ లేనివిధంగా, ఈ 20 నెలల కాలంలో మున్సిపాలిటీ పరిధిలో కోట్లాది రూపాయలతో సిసి రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించామని ఎమ్మెల్యే నాగేశ్వరరావు చెప్పారు. ప్రజలకు సౌకర్యంగా ఉండేలా సరికొత్త హంగులతో డివైడర్, సెంట్రల్ లైటింగ్ అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఏడాది ముఖ్యమంత్రి చంద్రబాబు కందుకూరు వచ్చినప్పుడు పట్టణ అభివృద్ధికి 50 కోట్లు మంజూరు చేస్తానని ప్రకటించడం, ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ డబ్బులు విడుదల చేస్తుండడంతో అభివృద్ధి వేగవంతంగా జరుగుతుందన్నారు. సిసి రోడ్ల నిర్మాణం క్వాలిటీగా చేపట్టి, త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అనూష, పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు, రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ చిలకపాటి మధు, పట్టణప్రధాన కార్యదర్శి షేక్ సలాం, స్థానిక నాయకులు వంకాయలపాటి రాజేంద్రప్రసాద్, వార్డు అధ్యక్షులు పర్సు నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి చదలవాడ ఇమ్మానియేలు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఉప్పుటూరి శ్రీను, రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి షేక్ రఫీ, నెల్లూరు పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ రూబీ, అధికార ప్రతినిధి చదలవాడ కొండయ్య, నియోజకవర్గ అధ్యక్షుడు అల్లం వెంకటేశ్వర్లు, నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు షేక్ మున్నా, వడ్డెళ్ళ రవిచంద్ర, రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి కూనం నరేంద్ర, పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు సవిడిబోయిన కృష్ణ, మాజీ కౌన్సిలర్ కొచ్చర్ల శ్రీను, చుండూరి శ్రీను, జియావుద్దీన్, కోట కిషోర్, మురారిశెట్టి సుధీర్, రాయపాటి శ్రీను, అన్ని వార్డుల అధ్యక్షులు పాల్గొన్నారు.

## హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ జిల్లా కోఆర్డినేటర్‌గా దొండేటి

**మార్కాపురం రూరల్ పెన్ పవర్ ఏప్రిల్1**



ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం దేవాదాయ ధర్మాదాయ శాఖకు అనుబంధంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ మార్కాపురం జిల్లా కోఆర్డినేటర్‌గా దొండేటి పెద్ద రామిరెడ్డి నియమితుల య్యారు. ఈ మేరకు ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ దాసరి శ్రీనివాసులు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారిక నియామక పత్రాన్ని విడుదల చేశారు. ఈ నియామక పత్రాన్ని బుధవారం హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ స్టేట్ కోఆర్డినేటర్ సందిరెడ్డి కొండలరావు ద్వారా అందుకోవడం జరిగింది. హిందూ సంస్కృతి పరిరక్షణ, సనాతన ధర్మ ప్రచారం, యువతలో ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందించడం, ధార్మిక విలువల పట్ల అవగాహన కల్పించడం వంటి లక్ష్యాలతో హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ నిరంతరం పనిచేస్తుంది. ఈ కార్యక్రమాలను గ్రామ స్థాయి నుంచి మండల, జిల్లా స్థాయి వరకు విస్తరించేందుకు కోఆర్డినేటర్ల పాత్ర ఎంతో కీలకం. ఈ నేపథ్యంలో మార్కాపురం జిల్లా కోఆర్డినేటర్‌గా నియమితులైన దొండేటి పెద్ద రామిరెడ్డి తన అనుభవం, నిబద్ధతతో ట్రస్ట్ కార్యక్రమాలను విజయవంతంగా ముందుకు తీసుకెళ్తారని ట్రస్ట్ ఆశాభావం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా దొండేటి పెద్ద రామిరెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యత అప్పగించిన ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ దాసరి శ్రీనివాసులు, స్టేట్ కోఆర్డినేటర్ సందిరెడ్డి కొండలరావు లకు కృతజ్ఞతలు తెలిపారు. హిందూ ధర్మ పరిరక్షణ, ప్రచారం కోసం అంకితభావంతో పనిచేస్తూ, ట్రస్ట్ లక్ష్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని చెప్పారు. రామిరెడ్డి జిల్లా కోఆర్డినేటర్ గా నియామకం పట్ల జిల్లాలోని పలువురు ఆధ్యాత్మికవేత్తలు, ధార్మిక సంస్థలు శుభాకాంక్షలు తెలిపారు.

## జిల్లా స్థాయి జిఎఫ్ఎల్ఎన్ పోటీల్లో కృష్ణంనాయునిపల్లి విద్యార్థి ప్రతిభ



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఏప్రిల్ 1**

మార్కాపురం లో జిల్లాస్థాయి నిర్వహించిన జిఎఫ్ఎల్ఎన్ పోటీల్లో కృష్ణంనాయునిపల్లి ప్రాథమిక పాఠశాలకు చెందిన 3వ తరగతి విద్యార్థి కె. గోవిందా రెడ్డి ప్రతిభ కనబరుస్తూ మొదటి స్థానాన్ని సాధించి మండలానికి గర్వకారణంగా నిలిచాడు. పోటీల అనంతరం అడిషనల్ డైరెక్టర్ సుబ్బారెడ్డి చేతుల మీదుగా గోవిందా రెడ్డి కి మెమెంటో ను అందజేశారుఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారులు జె. ప్రసాదరావు, రాజాల కొండారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షేక్ రేష్మ, ఉపాధ్యాయులు యుటిఎఫ్ నాయకులు షేక్ పాదుషా విద్యార్థి ని అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల్లో మౌలిక నైపుణ్యాలు, పఠన సామర్థ్యం, సృజనాత్మకత పెంపొందించడంలో జిఎఫ్ఎల్ఎన్ పోటీలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు విద్యార్థి గోవిందా రెడ్డి చూపించిన ప్రతిభ ఇతర విద్యార్థులకు ఆదర్శమని అభినందనలు తెలిపారు. అలాగే విద్యార్థుల ప్రతిభ వికాసానికి ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల సహకారం ఎంతో ముఖ్యమని, అలాంటి మద్దతుతోనే మండల విద్యార్థులు జిల్లా స్థాయిలో రాణిస్తున్నారని అన్నారు. గోవిందా రెడ్డి మరింత ఉన్నత స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

## గిద్దలూరు మున్సిపాలిటీ పన్ను వసూళ్లలో ప్రధమ స్థానం

**గిద్దలూరు,పెన్ పవర్ ఏప్రిల్ 1**



పట్టణాభివృద్ధికి పన్ను వసూళ్లే ప్రధాన ఆధారం అన్న విషయాన్ని గిద్దలూరు మున్సిపాలిటీ మరోసారి చాటింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను, నీటి చార్జీల వసూళ్లలో గణనీయ పురోగతి నమోదు కావడం విశేషం. ప్రైవేట్ ఆస్తులపై 75 శాతం, మొత్తం ఆస్తి పన్నులో 70 శాతం వసూళ్లు సాధించడం ద్వారా జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలవడం మున్సిపాలిటీ పనితీరుకు నిదర్శనంగా నిలిచింది. అయితే ఇంకా మెరుగుదలకు అవకాశం ఉన్నదనే భావనతో అధికారులు ముందుకు సాగుతున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు వార్డు సెక్రటరీలు కృషి చేయాలని కమిషనర్ సూచించారు. 2025--26 ఆర్థిక సంవత్సరానికి గాను 70 శాతం వసూళు పూర్తి చేయడంలో భాగస్వాములైన సిబ్బందికి అభినందనలు తెలిపారు. పట్టణంలో రహదారులు, కాలువలు, తాగునీటి సరఫరా, వీధి దీపాలు వంటి మౌలిక సదుపాయాల నిర్వహణకు మున్సిపల్ ఆదాయం కీలకమని కమిషనర్ రమణబాబు పేర్కొన్నారు. ప్రజలు చెల్లించే పన్నుల ద్వారానే ఈ సేవలు సమర్థవంతంగా కొనసాగుతాయని స్పష్టం చేశారు. కొంతమంది వద్ద కొనసాగుతున్న మొండి బకాయిలు అభివృద్ధికి ఆటంకంగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బకాయిలపై వడ్డీకి 50 శాతం రాయితీ వంటి సదుపాయాన్ని వినియోగించుకుని వెంటనే చెల్లింపులు చేయాలని పిలుపునిచ్చారు. "మన పట్టణం -- మన బాధ్యత" అనే భావనతో ప్రతి పౌరుడు ముందుకు రావాల్సిన అవసరం ఉందని, పన్నులు సమయానికి చెల్లించడం ద్వారా గిద్దలూరును మరింత శుభ్రంగా, సౌకర్యవంతంగా తీర్చిదిద్దడంలో భాగస్వాములు కావాలని సూచించారు.

## గ్రామదేవతలకు ఫ్యాన్లు బహుకరించిన ఇరగని మాధవరావు

### అభినందించిన కదిరి ప్రకాష్ రావు, పార్థసారథి



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఏప్రిల్ 1**

మండలంలోని శీలంవారిపల్లి గ్రామంలో భక్తి పూర్వక వాతావరణం నెలకొన్నది. గ్రామదేవతలైన అంకాలమ్మ, పోలేరమ్మ తల్లి ఉత్సవాల సందర్భంగా దేవస్థానంలో భక్తులకు ఇబ్బంది లేకుండా శీలంవారిపల్లి గ్రామానికి చెందిన ఇరగని వెంకట కొండయ్య- ద్రౌపతమ్మ దంపతుల జ్ఞాపకార్థంగా కుమారుడు మాధవ రావు, రవణమ్మ దంపతులు రెండు టేబుల్ ఫ్యాన్లను దేవస్థాన కమిటీ చైర్మన్ కదిరి వెంకట ప్రకాష్ రావు, కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కదిరి పార్థసారథి చేతులమీదుగా అందజేశారు ఈ సందర్భంగా కదిరి ప్రకాష్ రావు మరియు కదిరి పార్థసారథి మాట్లాడుతూ ఫ్యాన్లు బహుకణ దాత మాధవ- రవణమ్మ దంపతుల సేవా మనసును అభినందిస్తూ అంకాలమ్మ, పోలేరమ్మ అమ్మవారు మా గ్రామాన్ని, మా ప్రజలను ఎల్లప్పుడూ కాపాడే శక్తులని, దేవస్థానము అభివృద్ధికి , ఆధ్యాత్మిక వాతావరణ బలోపేతానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు అమ్మవారి దయ ఆశీర్వాదాలతో బహుకరించిన ఎరగని మాధవ కుటుంబ సభ్యులకు సంపదలతో అభివృద్ధి చెందాలని ఆశీర్వదించారు. పలువురు గ్రామస్తులు దాత మాధవరావు కుటుంబానికి ధన్యవాదాలు తెలుపుతూ అమ్మ వారి ఆశీర్వాదాలు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ సభ్యులు గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.

# రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాలకు రండి

### కని విని ఎరుగని రీతిలో బ్రహోత్సవాలు

### ప్రజలకు ఆహ్వానించిన ఎమ్మెల్యే ముత్తుముల






**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 01**

రాచర్ల మండలం జే పుల్లలచెరువు గ్రామంలో సమీపంలో నలమల్ల ప్రకృతి సోయగాల నడుమ స్వయంభువు గా వెలిసిన శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాలు ఈ ఏడాది కని ఎరుగని రీతిలో నిర్వహించటం జరుగితుందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి ప్రజలను , భసక్తులను ఆహ్వానించారు. ఏప్రిల్ 2 నుండి మొదలు ,5 వరకు జరుగుతాయన్నారు గతంలో ఎన్నడూ లేని విధంగా స్వామి వారి కళ్యాణ మహోత్సవం ,తెప్పోత్సవం, చక్రస్నానం అంగరంగ వైభవంగా కల్యాణం కమణీయంగా నిర్వహిస్తున్నామన్నారు ఈ బ్రహోత్సవాలకు గౌ " రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి , మరి కొంతమంది శాసనసభ్యులు ఈ బ్రహ్మోత్సవాలకు రావడం జరుగుతుందని భగవంతునిపై విశ్వాసంతో వారందరూ ఇక్కడికి వచ్చి నెమలిగుండ్ల రంగనాయక స్వామిని దర్శించుకోవడం జరుగుతుందని వారితో పాటుగా గిద్దలూరు నియోజకవర్గం ప్రజలు అందరూ వచ్చి ఆ దేవదేవుడిని దర్శించుకుని స్వామివారి తీర్థ ప్రసాదాలు శ్వీకరించి ఆశీర్వాదం పొందాలని మిమ్మల్ని అందరి ఆహ్వానిస్తున్నానని ఎమ్మెల్యే తెలిపారు.

## కోవిలంపాడులో ఘనంగా సీతారాముల కళ్యాణం






**సి ఎస్ పురం, పెన్ పవర్ ఏప్రిల్ 1**

మండలంలోని కోవిలంపాడు గ్రామంలో శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా బుధవారం గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు పండుగను పురస్కరించుకొని స్థానిక ఆలయంలో సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని గ్రామస్తులు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీత, రామ, లక్ష్మణ ఆంజనేయస్వామి నూతన విగ్రహాలను కోవిలంపాడు గ్రామానికి చెందిన తవ్వా శేషయ్య కుటుంబ సభ్యులు భక్తి భావంతో ఆలయ కమిటీకి అందజేశారు. విగ్రహాలను వారి ఇంటి నుండి ఆలయ ప్రాంగణం వరకు ప్రత్యేక ఊరేగింపుగా తీసుకెళ్లారు అనంతరం వేదమంత్రోచ్చారణ మధ్య సీతారాముల కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కళ్యాణోత్సవం అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయగా వందలాది మంది భక్తులు ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు సీతారాముల కళ్యాణం తిలకించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ సభ్యులు , గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.

## మద్దిమడుగు క్షేత్రంలో డాక్టర్ అశోక్ కుమార్ ప్రత్యేక పూజలు

**అద్దంకి ఆర్సి ఇంచార్జ్(పెన్ పవర్) ఏప్రిల్ 1:**



ప్రముఖ పుణ్యక్షేత్రమైన మద్దిమడుగులోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారిని అద్దంకి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్. అశోక్ కుమార్ చింతలపూడి బుధవారం దర్శించుకున్నారు. నియోజకవర్గ ప్రజల క్షేమం కోరుతూ ఆయన స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న అశోక్ కుమార్‌కు దేవాదాయ శాఖ ఈ.వో నరసింహులు, ఆలయ అర్చకులు, కమిటీ పెద్దలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి వారికి శాస్త్రోక్తంగా ప్రత్యేక అభిషేకాలు, అష్టోత్తర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తిశ్రద్ధలతో మారుమోగింది. ?పూజా కార్యక్రమాల అనంతరం అశోక్ కుమార్ మాట్లాడుతూ .. అద్దంకి నియోజకవర్గంలోని



ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని స్వామి వారిని వేడుకున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో పాడిపంటలు సమృద్ధిగా పండి, రైతులు ఆర్థికంగా నిలదొక్కుకోవాలని, అభివృద్ధికి ఆ హనుమంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ప్రజా సేవలో నిరంతరం కొనసాగే శక్తిని, ధైర్యాన్ని ప్రసాదించాలని కోరుకున్నట్లు చెప్పారు. అశోక్ కుమార్ ఆలయ అర్చకులకు, వేద పండితులకు, ఆలయ సిబ్బందికి నూతన వస్త్రాలను సమర్పించి ఆశీస్సులు తీసుకున్నారు. పండితులు వేదమంత్రాల మధ్య ఆయనకు తీర్థప్రసాదాలు అందజేసి, భవిష్యత్తులో ఉన్నతమైన రాజ్యాధికార యోగం కలగాలని, తలపెట్టిన ప్రతి కార్యం దిగ్విజయంగా పూర్తి కావాలని ఆశీర్వదించారు.

## కోరిశపాడులో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సమీక్ష

**అద్దంకి ఆర్సి ఇంచార్జ్(పెన్ పవర్) ఏప్రిల్ 1**

ప్రకాశం జిల్లా, కొరిశపాడు మండలంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.ఆర్.సి.ఏ. మహేష్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మండల కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.?మండలంలో జరుగుతున్న భూముల రీ-సర్వే ప్రక్రియ, కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల జారీ, పీజీఆర్ఎస్ అర్జీలు, ఇతర రెవెన్యూ సమస్యలపై ఆయన ప్రధానంగా చర్చించారు. రెవెన్యూ సిబ్బంది పూర్తి బాధ్యతగా వ్యవహరించి, ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. పనితీరును మెరుగుపరుచుకుని, ప్రకాశం జిల్లాలోనే మండలాన్ని మొదటి స్థానంలో నిలిపేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని ఈ సందర్భంగా ఆయన ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ జీ.వి సుబ్బారెడ్డి, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రకాశం రామయ్య జయంతి సందర్భంగా నివాళులు





**కందుకూరు పెన్ పవర్ ఏప్రిల్ 1**

ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాలలో ప్రముఖ విద్యావేత్త, సంస్థాపకుడు డా. కె. రామయ్య జయంతి సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వేదికపై కరస్పాండెంట్ డా. కె. విజయ్ శ్రీనివాస్, ఎమ్మెల్సీ డా. కె. శ్రీకాంత్, డా. రామయ్య సతీమణి కె. ధనలక్ష్మి ప్రిన్సిపాల్ సి.హెచ్. రవి కుమార్ లు రామయ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఆయన సేవలను స్మరించుకున్నారు. ఆయన చూపిన మార్గం, విలువలు, మరియు విద్యా రంగానికి చేసిన విశిష్ట సేవలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ డా. కె. శ్రీకాంత్ కరస్పాండెంట్ డా. కె. విజయ్ శ్రీనివాస్ కలిసి కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్ అండ్ డి సెల్‌ను ప్రారంభించి, విద్యార్థులు అభివృద్ధి చేసిన కొన్ని రియల్‌టైమ్ ప్రాజెక్టులను పరిశీలించారు. తదుపరి డా. కె. విజయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ, తన తండ్రి డా. రామయ్య దూరదృష్టి, విద్యాపట్ల ఉన్న నిబద్ధత, మరియు సంస్థను నిర్మించిన విధానాన్ని వివరించారు. ఈ క్యాంపస్‌లో ప్రతి మూలలో ఆయన విలువలు జీవిస్తూనే ఉన్నాయని తెలిపారు. అలాగే ఎమ్మెల్సీ డా. కె. శ్రీకాంత్ మాట్లాడుతూ, డా. రామయ్య సేవలు సమాజానికి చేసిన కృషిని గుర్తుచేసుకుంటూ, ఆయన ఆశయాలను కొనసాగించడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. ఆయన చూపిన విలువలతో ప్రకాశం ఇంజినీరింగ్ కళాశాలను మరింత అభివృద్ధి చేయడం ద్వారానే నిజమైన ఘన నివాళి అర్పించినట్లవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. సి.హెచ్ రవి కుమార్ మాట్లాడుతూ, డా. రామయ్య సంస్థకు కేవలం స్థాపకుడు మాత్రమే కాదు, మార్గదర్శి అని పేర్కొన్నారు. ఆయన చూపిన విలువలు, క్రమశిక్షణ, విద్యాపట్ల ఉన్న నిబద్ధతను కొనసాగించడం ప్రతి అధ్యాపకుడి బాధ్యత అని తెలిపారు. తదుపరి సీనియర్ అధ్యాపకులు తమ సేవా కాలంలో డా. రామయ్య తో ఉన్న అనుభవాలను, జ్ఞాపకాలను పంచుకుని ఆయన గొప్ప వ్యక్తిత్వాన్ని స్మరించుకున్నారు. కార్యక్రమం అనంతరం కళాశాల సిబ్బందికి భోజనాన్ని ఏర్పాటు చేశారు.

## ప్రభుత్వ ఉపాధ్యాయుడు సస్పెన్షన్

**పొన్నలూరు పెన్ పవర్ ఏప్రిల్ 1**

మండలంలోని సుంకిరెడ్డిపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎస్ జి టి గా విధులు నిర్వహిస్తున్న పిగిలి కొండయ్య బుధవారం సస్పెండ్ అయ్యారు. వివరాల ప్రకారం పది రోజుల క్రితం ఉపాధ్యాయుడిపై వచ్చిన ఆరోపణలపై ఉప విద్యాశాఖ అధికారి ఉన్నత అధికారులకు నివేదిక పంపించారు . బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి సివి రేణుక కొండయ్యను విధుల నుండి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## గిద్దలూరులో ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్న పోలీసులు!



**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 01**

గిద్దలూరు పట్టణంలో ట్రాఫిక్ ను పోలీసులు నియంత్రిస్తున్నారు. కొమరోలు సమీపంలోని అమరావతి--కడప జాతీయ రహదారి మరమ్మతుల కారణంగా వాహనాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. దీంతో వాహనాలను గిద్దలూరు నుంచి కడప వైపు కు మళ్లిస్తున్నారు. ఈ మార్పుల వల్ల గిద్దలూరు పట్టణంలో భారీ వాహనాలు, లారీలు ఎక్కువగా సంచరించడం జరుగుతోంది... దీనితో ట్రాఫిక్ రద్దీ ఏర్పడగా, పట్టణ ఎస్సై ఇమ్మానుయేల్ ఆధ్వర్యంలో పోలీసులు ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్నారు. ఈ సందర్భంగా రోడ్లపై ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలిపి వేయరాదని, ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా ప్రవర్తించరాదని పోలీసులు హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు విధిస్తామని అర్బన్ సీఐ సురేష్ తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## ఉపాధి పనులను ప్రారంభించిన ఎంపీడీఓ సుజాత



**పొన్నలూరు పెన్ పవర్ ఏప్రిల్ 1**

జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం మండల కేంద్రమైన పొన్నలూరు గ్రామంలో ఉపాధి పథకం క్రింద పనులను ఎంపీడీఓ సుజాత బుధవారం పూజా కార్యక్రమంతో ప్రారంభించడం జరిగింది. అనంతరం ఉపాధి కార్మికులకు ఉపాధి పనులపై అవగాహన కార్యక్రమము నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ,ఏపీ ఓ సుధాకర్ నీటి సంఘ చైర్మన్ మండవ ప్రసాద్ ప్రజాప్రతినిధులు మండవ మురళి ఫీల్డ్ అసిస్టెంట్ ఆధాము,తదితరులు పాల్గొన్నారు.

## పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలిలి

**అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశం**




**పెద్ద దోర్నాల పెన్ పవర్ ఏప్రిల్1**

మార్కాపురం జిల్లాకు తలమానికంగా ఉన్న వెలుగొండ ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. విజయ సునీత అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె అధికారులతో కలిసి ప్రాజెక్టు పనులు, ఫీడర్ కెనాల్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 15 నాటికి ప్రాజెక్టు పనులను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించిన నేపథ్యంలో ఆ దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులకు తెలిపారు. రోజుకు 4 మీటర్ల మేర కాంక్రీట్ పనులు చేయాలన్నారు. ప్రాజెక్టు పనులకు ఎలాంటి ఆటంకం లేకుండా అవసరమైన డీజిల్, గ్యాస్ సరఫరా చేస్తామని వివరించారు. అంతకు ముందు కలెక్టర్ దోర్నాల మండలంలోని చిన్న దోర్నాల లో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు, మార్కాపురం ఆర్డీవో పి.ప్రభాకర్, వెలుగొండ ప్రాజెక్టు ఎస్ఈ అబు తలీమ్, వెలుగొండ స్పెషల్ కలెక్టర్ శ్రీధర్ రెడ్డి, కంభం ఎస్ డి సి శివరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# కోవిలంపాడులో ఫెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఉగ్ర

**సి ఎస్ పురం, పెన్ పవర్ ఏప్రిల్ 1**



పేద కుటుంబాలకు గౌరవ ప్రదమైన జీవితాన్ని అందించడమే లక్ష్యంగా ప్రవేశెట్టిన ఎన్టీఆర్ బరోసా ఫెన్షన్ పంపిణీ ప్రతి నెల 1వ తేదీ రాగానే గ్రామాల్లో కోలాహలంగా కనిపిస్తుంది. ఏ పీ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం వృద్ధులకు, వితంతువులకు, దివ్యాంగులకు మరియు చేనేత కార్మికులకు ఈ పథకం ఒక వరమని కనిగిరి శాసన సభ్యులు ముక్కు ఉగ్ర నరసింహా రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన సీఎస్ పురం మండలం కోవిలం పాడు గ్రామంలో ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులకు ఫెన్షన్లను అందజేశారు. రూ.4 వేలు, రూ. 6 వేలు, రూ. 15 వేలు ఇలా అర్హులైనవారికి నేరుగా ఇంటివద్దకే వెళ్లి పార్టీలకు, కుల,మతాలకు అతీతంగా అందజేస్తున్నట్లు తెలియజేశారు. ప్రభుత్వం ఎన్ని ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలు కొనసాగిస్తుందని తెలిపారు. అలాగే ప్రతి గ్రామంలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో స్వర్ణ గ్రామ సచివాలయ సిబ్బంది ద్వారా లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షులు అమడసాని బాలకేశవరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వెంకటరెడ్డి , టిడిపి పార్టీ సీనియర్ నాయకులు ఎన్ సి మాలకొండయ్య, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు బోయళ్ల నారాయణరెడ్డి, మన్నేపల్లి శ్రీనివాసులు, మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు కూటగుళ్ల మహబూబ్ బాషా, అట్లూరి రామకృష్ణ రాజు, కోనంగి వెంకట కొండయ్య, కాలువ నరసయ్య, బాలకాశయ్య , పోలవరపు గురవయ్య, పోకల మాల్యాద్రి, కుటాగుల్ల మహబూబ్ భాష , రేనాటి వెంకటేశ్వర్లు, నీటి సంఘం అధ్యక్షులు మోహన్ రెడ్డి, మాజీ ఎంపిటిసి ఆలా తిరుపతయ్య, మాజీ గ్రామ పార్టీ అధ్యక్షులు నాయబ్ రసూల్, ఖలీల్ , కేశవరెడ్డి బోయిన మాలకొండయ్య, కేశవరెడ్డి, ప్రసాదు, గ్రామస్తులు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఉపాధిలో అక్రమాలు




**కొనకనమిట్ల పెన్ పవర్ ఏప్రిల్ 1 :**

ఉపాధి హామీ పథకం పనుల నిర్వహణలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ప్రాజెక్ట్ డైరెక్టర్ జోసఫ్ కుమార్ హెచ్చరించారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ జోసఫ్ కుమార్ మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం వేల కోట్లు వెచ్చించి ఉపాధి హామీ పనులను కల్పిస్తుందని,పనులను పారదర్శకంగా చేపట్టేందుకు సంబంధిత శాఖ అధికారులు అందుబాటులో ఉన్నారని తెలిపారు. మండలంలో 2024 నుంచి 2025 వరకు రూ.16 కోట్ల రెండు వేల మూడు వందల వ్యయంతో 649 పనులు చేపట్టామన్నారు. అయితే కొన్ని పంచాయతీల్లో చేసిన పనులకు సంబంధించి సరైన రికార్డులు,ఫోటోలు లేవని అసహనం వ్యక్తం చేశారు.సిద్ధవరం,రేగుమాని పల్లి గ్రామాలలో వేలిముద్రలు లేకుండా పేమెంట్ చేసినట్లు తెలిపారు.రేగుమానిపల్లి పంచాయతీలో చనిపోయినవారికి సైతం మస్టర్లు వేశారని సామాజిక తనిఖీ బృందం గుర్తించినట్లు తెలియచేసారు.నాగిరెడ్డిపల్లి,వాగుమడుగు,వద్దిమడుగు, పెద్దారికట్ల గ్రామాల్లో పనుల కొలతల్లో వ్యత్యాసాలు,మస్టర్ నిర్వహణ సక్రమంగా లేదని తెలియచేసారు.తనిఖీల్లో బయటపడిన అక్రమాలపై చర్యలు తీసుకుంటామని అక్రమాలు జరిగిన చోట బాధ్యుల నుంచి నిధులు రికవరీ చెయ్యాలని పీడీ జోసఫ్ కుమార్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి అశ్వినీ కుమార్,ఏపిడి నిర్మలా దేవి,ఎంపిడిఓ ఈశ్వరమ్మ,ఎస్ ఆర్పి మల్లిఖార్జున,ఏపిఓ బుల్లెన రావు ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

## శీలంవారిపల్లి లో నూతన విబిజిరాంజీ పనులు ప్రారంభం

**ఉపాధి పనులను పరిశీలించిన ఏపీవో సుబ్బారావు**

**సి ఎస్ పురం, పెన్ పవర్ ఏప్రిల్ 1**



మండలంలోని కోవిలంపాడు పంచాయతీ పరిధిలోని శీలంవారిపల్లి గ్రామంలో విజిబివి రామ్ జీ పనులను ఏపీఓ సుబ్బారావు బుధవారం ప్రారంభించి ఉపాధి పనులను పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ఆర్థిక సంవత్సరం 2026-2027 లో భాగంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల ప్రకారం పనులు ప్రారంభించడం జరిగిందని కూలీలందరూ ఉపాధి పనులకు హాజరై సద్వినియోగం చేసుకోవాలని సూచించారు నూతనంగా వచ్చిన కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చినటువంటి కొత్త పథకం కింద పనులను గుర్తించి ఉపాధి పనులను కల్పిస్తున్నామని, కొత్తగా వచ్చిన విధానంలో సమయపాలన పాటిస్తూ 125 రోజులు పెంచడం జరిగిందని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ , కూలీలు పాల్గొన్నారు.

## గ్రామాలలో అనుమానస్పద వ్యక్తులను గుర్తించండి.ఎస్సై సత్యనారాయణ



**పొన్నలూరు పెన్ పవర్ ఏప్రిల్ 1**

మండలంలోని కె అగ్రహారం గ్రామంలో బుధవారం ఎస్సై సత్యనారాయణ వేసవకాలంలో దొంగతనాలు గురించి ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సత్యనారాయణ మాట్లాడుతూ ఇంటి ముందు సిసిటివి కెమెరాలు ఏర్పాటు చేసి, అవి పనిచేస్తున్నాయో లేదో చూసుకోవాలి. స్మార్ట్ అలారమ్‌లు అమర్చుకోవడం వల్ల అనుమానాస్పద కదలికలను గుర్తించవచ్చు అని తెలిపారు.వేసవిలో ఆరుబయట, డాబాల మీద నిద్రించేటప్పుడు తలుపులు సరిగ్గా వేసుకున్నారో లేదో చూసుకోవాలి. పగటిపూట ఇళ్లు ఖాళీగా ఉంటే తాళాలు బలంగా చేయాలని సూచించారు.అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే 100కు డయల్ చేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని ప్రజలు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వైస్ జగన్‌ను కలిసిన - చేరెడ్డి శ్రీకాంత్ రెడ్డి



**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 01**

వైసిపి పార్టీ రాష్ట్ర గ్రీవియన్స్ సెల్ కార్యదర్శి చేరెడ్డి శ్రీకాంత్ రెడ్డి మాజీ ముఖ్యమంత్రి, పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిశారు. చేరెడ్డి శ్రీకాంత్ రెడ్డి ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ప్రత్యేకించి గిద్దలూరు ప్రాంతంలో పార్టీ కార్యకలాపాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, గ్రీవెన్స్‌లపై వివరంగా తెలిపారు. జగన్ ఈ సమస్యలను విని, పార్టీ కార్యకర్తలకు బలోపేతానికి,కృషి చేయాలని సూచించారు.

## మారిన విద్యుత్ సర్వీస్ సిరీస్ నెంబరు

**కొమరోలు పెన్ పవర్ ఏప్రిల్ 1**



మార్కాపురం జిల్లా ఏర్పడిన కారణంగా జిల్లాలోని విద్యుత్తు సర్వీస్ సిరీస్ నెంబర్లలో మార్పు జరిగిందని కొమరోలు విద్యుత్ శాఖ ఏఈ ఎం శ్రీనివాసులు తెలిపారు. నిన్న మొదటి వరకు విద్యుత్ సర్వీస్ నెంబర్ సిరీస్ 4 అంకెతో ప్రారంభం అయ్యేవని, ఆయన తెలిపారు. అయితే మార్కాపురం జిల్లా ఏర్పడిన కారణంగా విద్యుత్ సర్వీస్ నెంబర్ల సిరీస్ 4 కు బదులుగా 7 అంకెతో ప్రారంభం కానున్నాయని ఆయన తెలిపారు .కావున ఆన్లైన్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించి వినియోగదారులు తమ సర్వీస్ సిరీస్ నెంబర్ను 4కు బదులుగా 7 అంకెతో మొదలయ్యే విధంగా గుర్తించి విద్యుత్ బిల్లులు ఆన్లైన్ ద్వారా చెల్లించాలని తెలిపారు. త్వరలో తమ సిబ్బంది మీటర్లను పరిశీలించి సర్వీస్ సీరియస్ నెంబర్ను మార్పు చేస్తారని ఆయన తెలిపారు.

## మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలుకే!

**పొదిలి పోలీసు సబ్ ఇన్స్పెక్టర్ రాజేష్**

**పొదిలి, పెన్ పవర్, ఏప్రిల్ 1**

మద్యం సేవించి వాహనాలు నడిపితే, అటువంటి వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని పొదిలి మండల పోలీసు సబ్ ఇన్స్పెక్టర్ రాజేష్ హెచ్చరించారు. బుధవారం సాయంత్రం ఆయన పట్టణ శివారులోని మార్కాపురం అడ్డరోడ్డు ప్రాంతంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ ఐ రాజేష్ మాట్లాడుతూ వాహనదారులకు పలు సూచనలు సలహాలు అందించారు. వాహనదారులు రోడ్డు నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాల్సిందేనని, అందుకు భిన్నంగా వ్యవహరిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై రాజేష్ హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాల్సి ఉందన్నారు. వాహనదారులు రోడ్డు నియమ నిబంధనలను సక్రమంగా పాటించడం ద్వారా, సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ఎస్ ఐ రాజేష్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ రాజేష్ తో పాటు పోలీసు సిబ్బంది కూడా పాల్గొన్నారు.



# నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

### ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్



**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 1**

కృష్ణంశెట్టి పల్లె సబ్ స్టేషన్ పరిధిలో లైన్ మెయింటనెన్స్, ట్రీ కటింగ్ నిమిత్తం గురువారం ఉదయం గం.8:00 ల నుండి మధ్యాహ్నం గం.2:00 వరకు కృష్ణంశెట్టి పల్లె టౌన్ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నాము. గ్రామ ప్రజలు గమనించి సహకరించాలని ఏ ఈ కోరారు.

# రామాలయంలో పూజలు చేసిన కదిరి పార్థసారధి



**సి ఎస్ పురం, పెన్ పవర్ ఏప్రిల్ 1**

మండలంలోని కోవిలంపాడు గ్రామంలో రాములవారి కల్యాణమహోత్వములో భాగంగా బుధవారం కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల సెక్రటరీ కరెస్పాండంట్ కదిరి పార్థసారధి పూజలు చేశారు. ఈ సందర్భంగా కమిటీ వారు స్వాగతం పలికి పూలమాల వేసి శాలువాతో సత్కారించారు. ఈ కార్యక్రమం లో దుగ్గిరెడ్డి జయరెడ్డి, బి తిరుపతి రెడ్డి,మన్నెపల్లి పెద్దన్న,గోను రాజశేఖర్ రెడ్డి, మూరం మస్తాన్ రెడ్డి, తవ్వా శేషయ్య,బాలకేశవ రెడ్డి, నున్నా నారాయణ,తదితరులు పాల్గొన్నారు.

# పొదిలిలో చురుగ్గా పెన్షన్ల పంపిణీ





**పొదిలి పెన్ పవర్ , ఏప్రిల్ 1**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పథకం కింద పెన్షన్ల పంపిణీ కార్యక్రమం పొదిలిలో చురుగ్గా జరిగింది. బుధవారం నాడు సచివాలయాల అధికారులతో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు పెన్షనర్ల ఇండ్ల వద్దకు ఉదయం నుండే వెళ్లి వారికి పెన్షన్ నగదును అందజేశారు. తెల్లవారుజామునే తమ ఇండ్ల వద్దకు వచ్చి పెన్షన్ నగదును అందజేసినందుకు లబ్ధిదారులు రాష్ట్ర ప్రభుత్వానికి , అధికారులకు, తెలుగుదేశం పార్టీ నాయకులకు తమ కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి

**పుల్లల చెరువు పెన్ పవర్ ఏప్రిల్ 1**

జూన్ 30 లోగా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని ఎంపిడివో మరియదాసు అన్నారు.మండలంలోని గండిబావి గూడెంలో నిర్మాణంలో ఉన్న జన్మన్ ఇళ్లను ఎంపిడివో మరియదాసు,హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్ బుధవారం పరిశీలించారు.2024 లో జన్మన్ ఇల్లు మంజూరుకాగా,17 ఇల్లు బేస్మెంట్ లెవెల్,ఒకటి ఎల్ ఎల్ లెవెల్ లో ఉన్నాయని ఏఈ చంద్రశేఖర్ తెలిపారు.జూన్ 30 నాటికి ఇళ్లను పూర్తి చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడివో చక్రవర్తి,వర్క్ ఇనస్పెక్టర్ బాలు నాయక్,లబ్ధిదారులు పాల్గొన్నారు.



# చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ పథకం



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, శ్రీకాకుళం. ఏప్రిల్ 1 :** చేనేత కార్మికులపై విద్యుత్ ఖర్చు భారాన్ని తగ్గించడమే లక్ష్యంగా మగ్గం నేతన్న లకు నెలకు 200 యూనిట్ల వరకు, మరమగ్గం(పవర్ లూమ్) నేతన్నలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు అందించే పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. బుధవారం కోటబొమ్మాలి హడ్కో కాలనీలో ప్రజా సేవలో భాగంగా ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛను పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. మంత్రి, జిల్లా కలెక్టర్ స్వప్నికల్ దినకర్ పుండ్కర్ తో కలసి గడపగడపకు వెళ్లి సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి సామాజిక పింఛన్లు పారదర్శకంగా అందే విధంగా ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా క్షేత్రస్థాయిలో వాస్తవాలను రాష్ట్ర ముఖ్యమంత్రి సహకరిస్తున్నారని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ పథకాలు విజయవంతంగా అమలు చేసి ప్రజల నుండి సూపర్ హిట్ సంతృప్తి స్థాయి వచ్చిందన్నారు. రానున్న రోజుల్లో గ్రామాలలో మట్టి రోడ్లు లేని సిమెంటు రోడ్లు నిర్మించాలన్న తపనతో అభివృద్ధి దిశగా కృషి చేస్తున్నామన్నారు. కొత్తపేట అభివృద్ధి మాదిరిగా కోటబొమ్మలిలో కోటి రూపాయల వ్యయంతో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం, 60 లక్ష రూపాయలతో ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం బ్యాంకు నిర్మాణం చేపడుతున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ఒకే ఒక డిగ్రీ కళాశాల కోటబొమ్మాలిలో మంజూరు చేసి కోటబొమ్మాలి గౌరవాన్ని పెంపొందించామన్నారు. కోటబొమ్మాలి, టెక్కలి, సంతబొమ్మాలి మండలం లక్ష్మీపురం వద్ద నిరుపేదలకు పంపిణీ చేసేందుకు 95 శాతం నిర్మాణం చేపట్టిన హూద్ హూద్ ఇళ్లను గత ప్రభుత్వం పట్టించుకోలేదని, తిరిగి తమ ప్రభుత్వం 8 కోట్ల రూపాయలను మంజూరు చేసి టెండర్లను పూర్తి చేసినట్లు తెలిపారు. ఆరు మాసాల్లో హూద్ హూద్ ఇళ్లను పూర్తిచేసి అర్హత కలిగిన నిరుపేదలకు కేటాయిసమని స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నియోజవర్గ ప్రజల దాహార్తిని తీర్చేందుకు రాష్ట్రంలో మూడు ప్రాజెక్టులు మంజూరు కాగా నియోజవర్గానికి 620 కోట్లు మంజూచేసి రెండు సంవత్సరాలలో ప్రతి ఇంటికి శుద్ధ జలాలు అందించే బృహత్కర కార్యక్రమం చేపడతున్నామని అన్నారు. అభివృద్ధి, సంక్షేమంతో పాటు సమాంతర జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఆర్సెలార్ మిత్తల్ స్టీల్ ప్లాంట్ , గూగుల్ సెంటర్ ఏర్పాటు వల్ల లక్షల 50 మందికి ఉపాధి లభించనునట్టు తెలిపారు. నష్టాల్లో ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్ కు 17 వేల కోట్లు సహకారం అందించి ప్రభుత్వం ఆదుకున్నట్లు తెలిపారు. 3 వేల కోట్లు కేటాయించి వచ్చే రెండేళ్లలో ఉత్తరాంధ్రలోని అన్ని ప్రాజెక్టులు పూర్తి చేయాలన్న దృఢ సంకల్పంతో పనిచేస్తుందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమరావతి రాజధాని పనులు పరుగులు పెట్టిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం మూడు రాజధానుల ప్రకటనతో కాలయాపన చేసిందని అన్నారు. అమరావతి ఏకైక రాజధానిగా చట్టబద్ధత కల్పించేందుకు అసెంబ్లీలో ఆమోదించి, పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలోని ఐదు కోట్ల తెలుగు ప్రజల ఆకాంక్ష, రాష్ట్ర ముఖ్యమంత్రి ఆశయం నెరవేరనందన్నారు. మూలపేట పోర్టుకు భూములతో పాటు ఆ ప్రాంత మౌలిక వసతులు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఉప్పు భూములు అవసరాన్ని గుర్తించి రాష్ట్ర ముఖ్యమంత్రి, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కృషితో ఇటీవల 380 ఎకరాల భూమిని కేంద్ర ప్రభుత్వం కేటాయించినట్లు వివరించారు. పోర్టుకు నాలుగు లైన్ల రహదారి, రైల్వే మార్గం నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. మూలపేట, విష్ణు చక్రం గ్రామ ప్రజలకు పునరావాసం కింద నౌపడ వద్ద నిర్మించిన కాలనీ లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి ఆదర్శ కాలనీగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. కోటబొమ్మాలి కొత్తమ్మ తల్లి అమ్మవారు పండుగ ప్రభుత్వ అధికారిక పండుగగా ప్రకటించి కొత్తపేట నుండి కోటబొమ్మలి వరకు జిల్లా మినరల్ డెవలప్మెంట్ నిధులతో రహదారులు, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేసి సుందరంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు.

జిల్లాలో 3లక్షల 60 వేల మంది పింఛన్దారులకు 130 కోట్లు, టెక్కలి నియోజకవర్గంలో 41 వేల మందికి ర17.7 కోట్లు, కోటబొమ్మాలిలో వేయి మంది లబ్ధిదారులకు 43 లక్షలు స్వర్ణ వార్డు, స్వర్ణ గ్రామం సిబ్బంది ఇళ్లకు వెళ్లి పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. సామాజిక పింఛన్లు పంపిణీ పారదర్శకంగా పంపిణీ జరగాలని, సాంకేతిక సమస్యలు ఉంటే అధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. ప్రజలు స్వచ్ఛత పాటించి పరిసరాల పరిశుభ్రతను పాటించాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎం కృష్ణమూర్తి, మాజీ పి ఏ సి ఎస్ అధ్యక్షులు కింజరాపు హరిప్రసాద్, కళింగ వైశ్య కార్పొరేషన్ అధ్యక్షులు బోయిన గోవింద రాజులు, కోటబొమ్మాళి పీ ఏ సి ఎస్ అధ్యక్షులు వెలమల విజయ లక్ష్మీ, ఎంపిడిఓ ఫణీంద్ర కుమార్, తదితరులు, పాల్గొన్నారు.

# మంచినీటి పథకాన్ని ప్రారంభించిన సర్పంచ్ కె.సుభద్ర





**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఏప్రిల్ 1:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి మండలం జీకే వీధి పంచాయతీ పరిధిలోని బుడ్డమానుపాకలు చిన్న గొంది గ్రామంలో పంచాయతీ నిధులతో నిర్మించిన గ్రావిటీ వాటర్ పథకాన్ని స్థానిక సర్పంచ్ కోర్ర సుభద్ర, ఎంపీటీసీ రాజేశ్వరి ప్రారంభించారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, ఈ పథకం ప్రారంభంతో గ్రామంలో దీర్ఘకాలంగా ఉన్న మంచినీటి సమస్యకు పరిష్కారం లభించిందని హర్షం వ్యక్తం చేశారు. గ్రామ ప్రజలకు తాగునీరు సులభంగా అందుబాటులోకి రావడం ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు కృప, గ్రామస్తులు బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# వైఎస్ఆర్ సిపి నాయకులు ఎన్ని కట్టు కథలు చెప్పినా ప్రజలు నమ్మరు...




ఎమ్మెల్యే కళా వెంకటరావు..

**చీపురుపల్లి పెన్ పవర్ ఏప్రిల్ 1..** రాజ్యాంగబద్ధంగా ఏర్పాటు అవుతున్న అమరావతి రాజధానిపై శాసనమండలి సభ్యుడు బొత్స సత్యనారాయణ వ్యాఖ్యలు కోడిగుడ్లపైన వెంట్రుకలు పీకుతున్నట్లు ఉన్నాయని చీపురుపల్లి శాసనసభ్యులు కిమిడి కళా వెంకట్రావు అన్నారు. బుధవారం నాడు చీపురుపల్లి పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం చట్టబద్ధతతోనే అమరావతి రాజధాని ఏర్పాటు జరుగుతుందని అది చూసి ఓర్వలేక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆవాకులు చవాకులు మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో నడుస్తున్నది రాజారెడ్డి, బొత్స సత్యనారాయణ రాజ్యాంగాలు కాదని హెచ్చరించారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం తోని భావితరాలకు అవసరమైన అమరావతి నిర్మాణం జరుగుతుందన్నారు. ఐదు సంవత్సరాల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనలో ప్రజలు ఆటవిక పాలన చూశారన్నారు. వారి రాజ్యాంగం ప్రకారం రప్ప రప్ప పేరుతో దాడులు, కిట్టని వారిపై కేసులు, ప్రజా సంక్షేమ అభివృద్ధి తుంగలో తొక్కి దోచుకోవడం దాచుకోవడం లక్ష్యంగా వైసిపి నాయకులు పనిచేశారని, అందుకే గమనించిన ప్రజలు 151 సీట్లు ఉండి 11 సీట్లకే పరిమితం చేశారని వ్యాఖ్యానించారు. బొత్స అండ్ కంపెనీ ఇప్పటికైనా పిచ్చి మాటలు మానుకోవాలని హెచ్చరించారు. విభజన చట్టం ప్రకారమే రాష్ట్ర విభజన జరిగింతర్వాత అమరావతి ఏర్పాటుకు చట్టబద్ధతతో సిద్ధం చేశామన్నారు. చట్టం తన పని తాను చేసుకు పోవడాన్ని పదవులు లేని వైసిపి నాయకులు రెండు జిల్లాల్లో కూడా జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. మూలపేటకు ఎన్టీ రామారావు పరిపాల నుండే పోర్టు నిర్మాణానికి సలహాలు ప్రారంభమయ్యాయని తరువాత కాలంలో విజన్ ఉన్న నాయకుడిగా రాష్ట్ర ముఖ్యమంత్రి పూర్తిస్థాయి పోర్టు ఏర్పాటుకు సలహాలు చేశారని, వైసిపి ఐదేళ్ల పాలనలో 30% మాత్రమే పూర్తయిన పోతు పనులు కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత 70 శాతం పూర్తి చేసామని వివరించారు. ప్రజలను తప్పుదోవ పట్టించడానికి, రాష్ట్ర అభివృద్ధిని కుంటి పరచడానికి వైసిపి నాయకులు ఎన్ని కుటిల ప్రయత్నాలు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ప్రాంతీయ విభేదాలు సృష్టించడానికి వైసీపీ నాయకులు ఎన్ని కట్టుకథలు చెప్పిన ప్రజలు నమ్మరు అన్నారు. మూలపేట పోర్ట్ , జిఎంఆర్ ఎయిర్పోర్ట్, ఏర్పాటు, అనకాపల్లిలో 20 లక్షల కోట్లతో స్టీల్ ప్లాంట్ నిర్మాణం, విశాఖపట్నంలో 90 వేల కోట్లతో గ్రీన్ ఎనర్జీ తో పాటు పలు సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్న ఘనత చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు గుండెలు బాదుకుంటున్నారని వ్యాఖ్యానించారు. రాజ్యాంగం చట్టాలు విధివిధానాల పట్ల వైసిపి నాయకులు పూర్తి పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని హితువు పలికారు. 11 సీట్లకే పరిమితమైన వైసీపీ నాయకులు భవిష్యత్తులో వాటిని కూడా కోల్పోకుండా జాగ్రత్త పడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కే త్రిమూర్తుల రాజు, ఆలయ కమిటీ చైర్మన్ గవిడి నాగరాజు, మాజీ రెస్కో చైర్మన్ దన్నాన రామచంద్రుడు, మాజీ ఎంపీపీ పైల బలరాం, వెంపటాపు లక్ష్మనాయుడు, ఇజ్జిరోతు రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

# జల సంరక్షణ మిషన్ ప్రారంభం




**పుల్లల చెరువు పెన్ పవర్ ఏప్రిల్ 1**

మండలంలోని గండిబావి గూడెంలో జల సంరక్షణ మిషన్ ను ఎంపిడివో మరియదాసు,మండల టీడిపి కన్వీనర్ పోట్ల గోవిందు బుధవారం ప్రారంభించారు.ట్యాంకుల క్లోరినేషన్,వాటర్ పైపుల మరమ్మతులు,నీటికొరత గురించి ఎంపిడివో మరియదాసు గ్రామ ప్రజలకు వివరించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడివో చక్రవర్తి,పిడివో వెంకటేశ్వర్లు,ఇంజినీరింగ్ అసిస్టెంట్,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# జెండా ఆవిష్కరణకు స్థలం కేటాయించాలి

### పొదిలి మునిసిపల్ కమిషనర్ ను కోరిన బిజెపి నేత రమణారెడ్డి

**పొదిలి, పెన్ పవర్, ఏప్రిల్ 1**

పొదిలిలో బిజెపి జెండా ఆవిష్కరణకు అవసరమైన స్థలాన్ని కేటాయించాలని మండల బిజెపి అధ్యక్షులు డి రమణారెడ్డి మునిసిపల్ కమిషనర్ ను కోరారు. బుధవారం నాడు రమణారెడ్డి మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మారుతి రావు ను కలసి ఈ మేరకు వినతి పత్రాన్ని అందజేశారు. ఆరవ తేదీన బిజెపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జాతీయ పార్టీ ఆదేశాల మేరకు పట్టణంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని జరపాల్సి ఉందన్నారు. అందువల్ల భారతీయ జనతా పార్టీ జెండా ఆవిష్కరణ ఏర్పాటుకు సహకరించడం తోపాటు అవసరమైన స్థలాన్ని కేటాయించాలని బిజెపి అధ్యక్షులు రమణారెడ్డి మునిసిపల్ కమిషనర్ మారుతీరావును కోరారు.



పెన్ పవర్

గురువారం 2 ఏప్రిల్ 2026

## మహిళ క్రికెట్‌లో సంచలనం.. టీమిండియా రికార్డు బ్రేక్ చేసిన కివీస్ కెప్టెన్





**హైదరాబాద్ పెన్ పవర్:** న్యూజిలాండ్ వర్సెస్ సౌతాఫ్రికా మహిళల రెండో వన్డే వెల్లింగ్టన్ వేదికగా జరిగింది. ఈ మ్యాచులో కివీస్ అమ్మాయిల జట్టు చారిత్రత్మక విజయాన్ని నమోదు చేసింది. సఫారీ జట్టు నిర్ధేశించిన 347 పరుగుల టార్గెట్ న్ని చేధించి టీమిండియా పేరిట ఉన్న ప్రపంచ రికార్డును న్యూజిలాండ్ తిరగరాసింది. ఉమెన్స్ వన్డే క్రికెట్ చరిత్రలో అత్యధిక పరుగులు ఛేజ్ చేసిన జట్టుగా బ్లాక్ క్యాప్స్ రికార్డుల్లోకి ఎక్కింది. కాగా ఇంతకు ముందు ఈ హిస్టరీ భారత మహిళల జట్టు పేరుపై ఉండేది. వన్డే ప్రపంచకప్-2025లో ఆస్ట్రేలియాతో జరిగిన సెమీఫైనల్ లో ఉమెన్ ఇన్ బ్లూ.. 339 రన్స్ లక్ష్యాన్ని చేజ్ చేసింది. ఇప్పుడు ఈ రికార్డును న్యూజిలాండ్ బ్రేస్ చేసేసింది. ఈ మ్యాచ్ మొదట బ్యాటింగ్ చేసిన ప్రోటీస్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 346 రన్స్ చేయగా.. దక్షిణాఫ్రికా బ్యాటర్లలో అన్నేకే బోష్ (91), కెప్టెన్ లారా వోల్వార్డ్(69), ట్రయోన్(52), జాఫ్టా(37) అద్భుతంగా ఆడారు.

ఇక ఈ భారీ లక్ష్య చేధన కోసం బరిలోకి దిగిన న్యూజిలాండ్ బ్యాటర్లు సుజీ బేట్స్(8), ప్లిమ్మర్(23), మ్యాడీ గ్రీన్(13) ఘోరంగా విఫలం కావడంతో కెప్టెన్ అమెలియా కెర్ మాత్రం సంచలన ఇన్నింగ్స్ ఆడింది. ఓ వైపు క్రమంగా వికెట్లు పడుతున్నప్పటికి ఆమె మాత్రం తన విధ్వంసకర బ్యాటింగ్ ని కొనసాగించింది. చివరి ఓవర్లో 11 పరుగులు కావాల్సి ఉండగా.. కేర్ వరుసగా 3 బౌండరీలు బాది కివీస్ జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించింది. ఈ మ్యాచులో కెప్టెన్ అమేలియా కెర్ కేవలం 139 బంతుల్లో 23 ఫోర్లు, ఒక సిక్సుతో 179 పరుగులు చేసి అజేయంగా నిలిచింది.

మొత్తంగా మహిళల వన్డే క్రికెట్లో లక్ష్య చేధనలో అత్యధిక వ్యక్తిగత స్కోర్ సాధించిన రెండో ప్లేయర్ గా అమెలియా కేర్ నిలిచింది. అలాగే న్యూజిలాండ్ గడ్డపై వన్డేల్లో అత్యధిక వ్యక్తిగత పరుగులు సాధించిన మహిళ ప్లేయర్ గా కూడా కేర్ చరిత్ర నెలకొల్పింది. మ్యాచ్ అనంతరం జరిగిన మీడియా ప్రెజెంటేషన్‌లో కేర్ మాట్లాడుతూ.. ఈ ఇన్సింగ్స్ నాకు చాలా ప్రత్యేకమైనది. మేము డ్రెస్సింగ్ రూమ్‌లో ఉన్నప్పుడు కూడా గెలవగలమని నమ్మా, నేను మైదానంలోకి వెళ్లిన తర్వాత ముందుకు సాగాల్సిందేనని ఫిక్స్ అయినట్లు వెల్లడించింది.

## ఐపీఎల్‌లో డబ్బులు రావు.. అందుకే ఆడట్లేదు: ఆడమ్ జంపా

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచంలోని అత్యుత్తమ వైట్ బాల్ స్పిన్నర్లలో ఒకడైన ఆస్ట్రేలియా లెగ్ స్పిన్నర్ ఆడమ్ జంపా, ఐపీఎల్ 2026 వేలానికి దూరంగా ఉండటంపై సంచలన వ్యాఖ్యలు చేశాడు. తన నైపుణ్యానికి ఐపీఎల్‌లో సరైన విలువ, డబ్బు లభించడం లేదని, అందుకే ఈ లీగ్‌లో ఆడటం లేదని స్పష్టం చేశాడు. ప్రస్తుతం జంపా పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్)లో కరాచీ కింగ్స్ తరపున ఆడుతున్నాడు. ఇటీవల ఒక పాడ్‌కాస్ట్‌లో మాట్లాడుతూ జంపా తన అసంతృప్తిని బయటపెట్టాడు. “ఈ ఏడాది నేను ఐపీఎల్ నుంచి తప్పుకున్నాను. నిజం చెప్పాలంటే, నా లాంటి నైపుణ్యం ఉన్న ఆటగాడికి ఐపీఎల్‌లో ఇతర నైపుణ్యాలు ఉన్నవారికి లభించేంత డబ్బు రాదు. ఐపీఎల్ కోసం చాలా సమయం కేటాయించాల్సి ఉంటుంది. కానీ, అందుకు తగిన ప్రతిఫలం లేనప్పుడు అంత సమయం వెచ్చించడం సరైన నిర్ణయం అని నాకు అనిపించలేదు” అని జంపా వివరించాడు. గతంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్‌ఆర్‌హెచ్) జంపాను విడుదల చేయగా, అతను ఈసారి వేలం కోసం తన పేరును నమోదు చేసుకోలేదు. 2016లో రైజింగ్ పుణె సూపర్ జెయింట్స్‌తో అరంగేట్రం చేసిన అతను, ఆ తర్వాత రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ), రాజస్థాన్ రాయల్స్ (ఆర్‌ఆర్) జట్లకు కూడా ప్రాతినిధ్యం వహించాడు. మొత్తం 22 ఐపీఎల్ మ్యాచ్‌లలో 8.37 ఎకానమీ రేటుతో 31 వికెట్లు పడగొట్టాడు. అయితే, ఏ సీజన్‌లోనూ ఆరు కంటే ఎక్కువ మ్యాచ్‌లు ఆడలేకపోయాడు.

పీఎస్ఎల్‌లో ఆడాలన్నది చివరి నిమిషంలో తీసుకున్న నిర్ణయమని జంపా తెలిపాడు. మొదట విశ్రాంతి తీసుకోవాలని భావించినా, నెల రోజుల క్రితం పీఎస్ఎల్ నుంచి అవకాశం రావడంతో వెంటనే అంగీకరించానని చెప్పాడు. ఐపీఎల్ నిబంధనల ప్రకారం తుది జట్టులో నలుగురు విదేశీ ఆటగాళ్లకే అవకాశం ఉంటుంది. దీంతో ఫ్రాంచైజీలు ఎక్కువగా పవర్ హిట్టర్లు, ఆల్-రౌండర్లు, ఫాస్ట్ బౌలర్ల కోసం భారీ మొత్తంలో ఖర్చు చేస్తాయి. స్పిన్నర్ల విషయంలో భారత్‌లో



నాణ్యమైన స్థానిక ఆటగాళ్లు అందుబాటులో ఉండటంతో విదేశీ స్పిన్నర్లకు పెద్దగా డిమాండ్ ఉండటం లేదు. జంపా వ్యాఖ్యలు ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.

## భారత్-జింబాబ్వే మధ్య రెండు సిరీస్‌లు.. షెడ్యూల్ విడుదల




**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్ ఛాంపియన్‌గా నిలిచిన టీమిండియా మరో అంతర్జాతీయ సిరీస్‌కు సిద్ధమైంది. ఈ ఏడాది జులైలో జింబాబ్వేలో పర్యటించి మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో పాల్గొననుంది. ఈ మేరకు జింబాబ్వే క్రికెట్ బోర్డు అధికారిక ప్రకటన విడుదల చేసింది. హరారే స్పోర్ట్స్ క్లబ్ వేదికగా జులై 23, 25, 26 తేదీల్లో ఈ మ్యాచ్‌లు జరగనున్నాయి. భారత కాలమానం ప్రకారం అన్ని మ్యాచ్‌లు సాయంత్రం 4:30 గంటలకు ప్రారంభమవుతాయి. ఇటీవల ముగిసిన 2026 టీ20 ప్రపంచకప్‌లోనూ ఇరు జట్లు తలపడ్డాయి. చెన్నైలో జరిగిన సూపర్-8 దశ మ్యాచ్‌లో భారత్ 72 పరుగుల తేడాతో జింబాబ్వేపై ఘన విజయం సాధించింది. అంతకుముందు 2024 టీ20 ప్రపంచకప్ గెలిచిన వెంటనే కూడా టీమిండియా జింబాబ్వేలో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడి 4-1 తేడాతో గెలుపొందింది. తాజా ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా, శ్రీలంక వంటి బలమైన జట్లు ఉన్న గ్రూప్‌లో టాప్‌లో నిలిచి సూపర్-8కు చేరిన జింబాబ్వే, అదే జోరును సొంతగడ్డపై కొనసాగించాలని భావిస్తోంది.

ఈ సిరీస్‌పై జింబాబ్వే క్రికెట్ మేనేజింగ్ డైరెక్టర్ గివ్‌మోర్ మకోనీ మాట్లాడుతూ.. “భారత్‌తో మ్యాచ్‌లంటే ఎప్పుడూ భారీ ఆసక్తి ఉంటుంది. ప్రపంచ ఛాంపియన్లతో సొంతగడ్డపై తలపడటం మా ఆటగాళ్లకు ఒక గొప్ప అవకాశం. ప్రపంచకప్‌లో మా ప్రదర్శన ప్రోత్సాహకరంగా ఉంది. ఈ సిరీస్ ద్వారా ఆ జోరును కొనసాగించి, అంతర్జాతీయ క్రికెట్‌లో మరింత పోటీ శక్తిగా ఎదగడానికి ఇది బలమైన పునాది వేస్తుంది” అని వివరించారు. ఇక, వచ్చే ఏడాది ఆరంభంలో జింబాబ్వే జట్టు భారత్‌లో పర్యటించనున్నట్లు బీసీసీఐ ఇదివరకే ప్రకటించింది. 2027 జనవరిలో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ జరగనుంది. కోల్‌కతా (జనవరి 3), హైదరాబాద్ (జనవరి 6), ముంబై (జనవరి 9) ఈ మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. దాదాపు 25 ఏళ్ల తర్వాత జింబాబ్వే జట్టు భారత్‌లో ద్వైపాక్షిక సిరీస్ ఆడనుండటం విశేషం. చివరిసారిగా 2002 మార్చిలో జింబాబ్వే భారత్‌లో పర్యటించింది. ఈ సుదీర్ఘ విరామం తర్వాత భారత్‌లో పర్యటించడంపై మకోనీ సంతోషం వ్యక్తం చేశారు. “రెండు దశాబ్దాల తర్వాత మళ్లీ ద్వైపాక్షిక సిరీస్ కోసం భారత్‌లో పర్యటించడం ఒక చారిత్రాత్మక క్షణం. ఇది మా ఆటగాళ్లకు దక్కిన గౌరవం, విలువైన అవకాశం. ఈ పర్యటన ఇరు దేశాల మధ్య క్రికెట్ సంబంధాలను మరింత బలోపేతం చేస్తుందని, మా జట్టుకు ఎంతో అనుభవాన్ని ఇస్తుందని ఆశిస్తున్నాం” అని తెలిపారు.

# అఖిల్ ని మారుతి లైన్ లో పెడుతున్నాడా?

అక్కినేని వారసుడు అఖిల్ సక్సెస్ కోసం ఎలా ఎదురు చూస్తున్నాడో? చెప్పాల్సిన పనిలేదు. ఎన్నో ఆశలు పెట్టుకున్న -ఏజెంట్- ఫలితం ఊహించని విధంగా రావడంతో? మరోసారి ఫ్లాప్ రూపంలో గట్టి ఎదురు దెబ్బ తగిలింది. -మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్ లర్- తో వచ్చిన సక్సెస్ ను -ఏజెంట్- తోనూ కొనసాగించాలని చూసిన ఆలోచనకు బ్రేక్ పడింది. -ఏజెంట్- హిట్ అయితే కెరీర్ కొత్త టర్నింగ్ తీసుకుంటుందని ఎంతో ఆశించాడు కానీ ఫలితం తీవ్ర నిరాశనే మిగిల్చింది. దీంతో కొత్త కథలు, దర్శకుల విషయంలో ఆచితూచి అడుగులు వేస్తున్నాడు.









ప్రస్తుతం మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వంలో -లెనిన్- లో నటిస్తోన్న సంగతి తెలిసిందే. రాయలసీమ బ్యాక్ డ్రాప్ లో తెరకెక్కుతోన్న చిత్రమిది. ఇప్పటికే చిత్రీకరణ ముగింపు దశకే చేరుకుంది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా జరుగు తున్నాయి. సమ్మర్ కానుకగా రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు. అయితే అగ్ర హీరోల చిత్రాలు రిలీజ్ కు ఉండ టంతో వెనక్కి తగ్గుతున్నాడు. మరి తదుపరి చిత్రాల సంగతేంటి? అంటే ఓ ఇంట్రెస్టింగ్ విషయం లీకైంది. అఖిల్ కోసం మారుతి ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే అఖిల్ తో రెండు..మూడు మీటింగ్లు కూడా జరిగాయని సన్నిహిత వర్గాల నుంచి తెలిసింది.

మరి ఈ కాంబో సెట్ అవుతుందా? లేదా? అన్నది ఇంకా చర్చల దశలో ఉంది కాబట్టి క్లారిటీ రావడానికి సమయం పడతుంది. మారుతి చివరిగా ప్రభాస్ తో తెరకెక్కించిన -ది రాజాసాబ్- ఫ్లాప్ అయిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి మారుతి హీరోల విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తర్వాత ఏ హీరోతో సినిమా చేసిన అది పక్కా హిట్ అవ్వాలనే కసితో పని చేస్తున్నాడు. ఇప్పటికే మారుతి అక్కినేని కాంపౌండ్ లో నాగచైతన్య హీరోగా -శైలిజ రెడ్డి అల్లుడు- అనే సినిమా తెరకెక్కించిన సంగతి తెలిసిందే. ఈ సినిమాకు మిశ్రమ స్పందన వచ్చింది. కానీ కమర్శియల్ గా మంచి లాభాలే తెచ్చి పెట్టింది. ఆ పాజిటివ్ సైన్ అఖిల్ సినిమా పరంగా కలిసొచ్చే అవకాశం ఉంది.ు

అఖిల్ కూడా కొత్త దర్శకుల్ని ఎంచుకోవడంలో విఫలమవుతున్నాడు. ఇంత వరకూ అతడు చేసిన ప్రయత్నాల్లో ఒకటి రెండు తప్ప పెద్దగా కలిసి రాలేదు. ఈ క్రమంలో మారుతి లాంటి అనుభవం ఉన్న దర్శకుడితో సినిమా చేస్తే అఖిల్ కి ప్లస్ అవుతుందనే భావన ఉంది.ఇంకా అఖిల్ వేర్వేరు దర్శకులతోనూ టచ్ లో ఉన్నాడు. వాళ్లందరిలో ఎవరి మంచి కథతో ముందుకొస్తే వాళ్లతోనే ముందుకెళ్తాడు. మరి మారుతి విషయంలో ఎలాంటి ప్రకటన వస్తుందో చూడాలి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com